www.vaarthavedhikasurya.com
PRGI.NO:- TGTEL/25/A0305
# వార్త వేదిక సూర్య
తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY

| యాదాద్రి భువనగిరి | సంపుటి: 1 | సంచిక: 313 | గురువారం, 9 ఏప్రిల్, 2026 | ఎడిటర్: పోలోజు శ్రీనివాసచారి | పేజీలు: 8 | వెల: 5-00 |
|---|---|---|---|---|---|---|
| YADADRI BHUVANAGIRI | VOLUME : 1 | ISSUE : 313 | THURSDAY, APRIL 9, 2026 | EDITOR : POLOJU SRINIVASA CHARY | PAGES : 8 | RS : 5-00 |


## ఘోష్ కమిషన్‌పై 22న తీర్పు

• అనాథల పేరిట నిధుల స్వాహాపై హైకోర్టు తీవ్ర మండిపాటు

2 లో..



# 2 వారాలు సీజ్‌ఫైర్

• కాల్పుల విరమణకు ఇరాన్, అమెరికా, ఇజ్రాయెల్ అంగీకారం
• హొర్ముజ్‌ను తెరిచేందుకు ఇరాన్ సమ్మతి.. గంటల్లో మళ్లీ మూత
• దీర్ఘకాలిక శాంతికి ఇస్లామాబాద్‌లో 11న అమెరికా, ఇరాన్ చర్చలు
• 10 నిమిషాలు.. 100 దాడులు..
• లెబనాన్‌పై విరుచుకుపడ్డ ఇజ్రాయెల్
• 1982 తర్వాత ఇదే అతి పెద్ద దాడి
• 200 మందికి పైగా పౌరుల దుర్మరణం
• క్షతగాత్రులతో నిండిన దవాఖానలు
• లెబనాన్‌కు 'సీజ్ ఫైర్' వర్తించదన్న ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు
• సీజ్ ఫైర్ డీల్ జరిగినా ఆగని దాడులు
• ఇరాన్‌లోని ఆయిల్ రిఫైనరీపై బాంబులు
• గల్ఫ్ దేశాలపై విరుచుకుపడ్డ ఇరాన్




**టెహ్రాన్, ఏప్రిల్ 8:** పశ్చిమాసియా యుద్ధానికి తాత్కాలికంగా తెరపడింది. రెండు వారాల కాల్పుల విరమణకు ఇరాన్, అమెరికా, ఇజ్రాయెల్ అంగీకరించాయి. ఇరాన్ నాగరికతను నాశనం చేస్తానన్న తన హెచ్చరికల నుంచి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెనక్కి తగ్గడానికి వీలు కల్పించిన చివరి నిమిషపు ఒప్పందం ఇది. యుద్ధంలో తమదే విజయమని అటు అమెరికా, ఇటు ఇరాన్ ప్రకటించాయి. కాల్పుల విరమణ ప్రకటన వెలువడిన కొన్ని గంటలకే ఇరాన్, లెబనాన్, గల్ఫ్ దేశాల్లో బుధవారం మళ్లీ దాడులు జరిగాయి. లెబనాన్‌పై ఇజ్రాయెల్ విరుచుకుపడింది. దీన్ని నిరసిస్తూ హొర్ముజ్ జలసంధిని ఇరాన్ మళ్లీ మూసివేసింది. లెబనాన్‌పై దాడులు ఆపకపోతే ఒప్పందం నుంచి వైదొలుగుతామని హెచ్చరించిది. అమెరికా ఉపాధ్యక్షుడు క్లిష్టమైనదిగా అభివర్ణించిన ఈ ఒప్పందం నీరుగారిపోవడానికి తాజా దాడులు కారణమౌతాయన్న ఆందోళన వ్యక్తమవుతున్నది. ఒప్పందంలోని అంశాలపై ఉభయపక్షాలు భిన్న వివరణలు ఇవ్వడంతో కాల్పుల విరమణ ఒప్పందంపై ఇప్పటికీ స్పష్టత లేదు. హొర్ముజ్ జలసంధి గుండా వెళ్లే నౌకలపై రవాణా రుసుము వసూలు చేసే విధానాన్ని అధికారికం చేసుకోవడానికి ఈ ఒప్పందం వీలు కల్పిస్తుందని ఇరాన్ తెలిపింది. కానీ ఒప్పందంలోని అంశాలు స్పష్టంగా లేవు. అలాగే చమురు రవాణాకు కీలకమైన ఈ మార్గాన్ని ఉపయోగించడం నౌకలకు సురక్షితమనిపిస్తుందో లేదో కూడా స్పష్టత లేదు. ఈ షరతుకు వేరే ఏ దేశమైనా అంగీకరించిందీ కూడా స్పష్టత లేదు. ఇరాన్ మద్దతు ఉన్న ఉగ్రవాద సంస్థ హెజ్బొల్లాపై లెబనాన్‌లో ఇజ్రాయెల్ ప్రారంభించిన భూతల దాడులు తాత్కాలికంగా నిలిచిపోతాయని ఒప్పందానికి మధ్యవర్తిత్వం వహించడంలో సాయపడిన పాకిస్థాన్, ఇతర దేశాలు తెలిపాయి. అయితే ఇజ్రాయెల్ మాత్రం లెబనాన్‌లో తమ దాడులు ఆగబోవని స్పష్టం చేయడంతోపాటు బుధవారం బీరుట్‌లో భీకర దాడులను కొనసాగించింది. యుద్ధం ప్రారంభించడానికి అమెరికా, ఇజ్రాయెల్‌కు ప్రధాన కారణాలైన ఇరాన్ క్షిపణి, అణు కార్యక్రమాల నిర్మూలన భవిష్యత్తు ఏమిటో కూడా స్పష్టత లేదు. శిథిలాల అడుగున ఉన్న శుద్ధి చేసిన యురేనియంను వెలికితీయడంలో ఇరాన్‌తో కలసి పనిచేస్తామని ట్రంప్ ప్రకటించగా ఇరాన్ మాత్రం దీన్ని ధృవీకరించలేదు. కాల్పుల విరమణ ప్రకటన అనంతరం టెహ్రాన్ వీధుల్లోకి వచ్చిన ఇరాన్ పౌరులు అమెరికాకు మరణం, ఇజ్రాయెల్‌కు మరణం అని నినాదాలు చేస్తూ అమెరికా, ఇజ్రాయెల్ జెండాలను తగలబెట్టారు.

### ఒప్పందంపై భిన్న వాదనలు

ఫిబ్రవరి 28న ఇజ్రాయెల్‌తో కలసి అమెరికా ప్రారంభించిన యుద్ధాన్ని ముగించడంలో ఇరాన్ ప్రతిపాదించిన 10 అంశాల ప్రణాళిక సాయపడుతుందని ట్రంప్ తొలుత అన్నారు. అయితే అణ్వాయుధ నిర్మాణానికి కీలకమైన యురేనియంను శుద్ధి చేసే ప్రక్రియను ఇరాన్ కొనసాగించడానికి అనుమతిస్తారని సూచిస్తూ పార్సీ భాషలో ఒక ప్రకటన వెలువడగా ట్రంప్ దానిపై వివరణ ఇవ్వకుండానే అది మోసపూరితమైనదని ఖండించారు. హొర్ముజ్ జలసంధి సమీపంలోనే అమెరికా యుద్ధనౌకలు చక్కర్లు కొడుతూ ఉంటాయని కూడా ట్రంప్ సూచించారు. రానున్న రోజుల్లో అది ఉద్రిక్తతకు దారితీసే అవకాశం ఉంది. మరోవైపు యుద్ధాన్ని ముగించడానికి ఇరాన్ చేస్తున్న డిమాండ్లలో ఆ ప్రాంతం నుంచి అమెరికా సైనిక దళాలను ఉపసంహరించుకోవడం, ఆంక్షలను ఎత్తివేయడం, స్తంభింపచేసిన తమ ఆస్తులను విడుదల చేయడం వంటివి ఉన్నాయి. యుద్ధానికి శాశ్వత ముగింపు పలికే అంశంపై ఇస్లామాబాద్‌లో 11న మొదటి విడత చర్చలు ప్రారంభమవుతాయని, ఉపాధ్యక్షుడు వాన్స్ అమెరికా బృందానికి సారథ్యం వహిస్తారని వైట్‌హౌస్ తెలిపింది.

మిగతా 2లో..





# సమాజాభివృద్ధికి చేయి కలపండి

• ప్రాధాన్య రంగాలను మీరే ఎంచుకోండి.. సహకరిస్తాం
• సీఎస్ఆర్ నిధుల అంశంలో పలు కంపెనీల ప్రతినిధులతో సీఎం
• తెలంగాణలో పెట్టుబడులకు సిద్ధంగా ఉన్నాం
• సీఎం రేవంత్‌ను కలిసిన టాటా లాక్‌హీడ్ సంస్థ ఎండీ
• సీఎంతో ఘనా హైకమిషనర్ భేటీ

**హైదరాబాద్, (వార్త వేదిక సూర్య)-ఏప్రిల్ 8:**

సమాజాభివృద్ధి కోసం వెచ్చించే నిధులను ఖర్చుగా కాకుండా భాగస్వామ్యంగా భావించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్ ) నిధుల అంశంపై వివిధ కార్పొరేట్ కంపెనీల ప్రతినిధులతో బుధవారం ఆయన సమావేశమయ్యారు. సీఎస్ఆర్ కింద కంపెనీలు చేస్తున్న వ్యయం వందకు వంద శాతం సత్ఫలితాలు ఇచ్చేలా ఉండాలని సీఎం రేవంత్ ఈ సందర్భంగా అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యం, జలవనరుల సంరక్షణకు ప్రాధాన్యమిస్తోందని తెలియజేశారు. కంపెనీలు వీటితోపాటు తమకు ఇష్టమైన ఏ రంగాన్నైనా ఎంచుకుని వాటికి సీఎస్ఆర్ నిధులను వినియోగించాలని కోరారు. ప్రభుత్వం, కంపెనీలు కలిపి చేసే వ్యయంతో రాష్ట్ర విద్యార్థులను ప్రపంచస్థాయి నైపుణ్యం కలిగిన వారిగా తీర్చిదిద్ది భవిష్యత్ అవకాశాలను అందుకునేలా తయారుచేయగలమని ఆశాభావం వ్యక్తం చేశారు. విద్యపై పెట్టే ఖర్చును తాము భవిష్యత్ తరాలకు పెట్టుబడిగా భావిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలోని మొత్తం విద్యార్థుల సంఖ్యలో హైదరాబాద్‌లోనే 44 శాతం మంది ఉన్నారని, వారికి నాణ్యమైన విద్య అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కంపెనీలు స్థానికంగా ఉన్న అన్నిరకాల మౌలిక వసతులను వినియోగించుకుంటున్నందున తమ సీఎస్ఆర్ నిధుల్లో ఎక్కువ మొత్తాన్ని అదే ప్రాంత అభివృద్ధికి కేటాయించాలన్నారు. సీఎస్ఆర్ నిధుల వినియోగంలో ఇప్పటివరకు సరైన విధానం లేనందున తాము ఒక ప్రత్యేక కార్యదర్శిని నియమించామని, కంపెనీల ప్రతినిధులు ఆ ప్రత్యేక కార్యదర్శితో సమన్వయం చేసుకోవాలన్నారు. కంపెనీలు తమకు ఆసక్తి ఉన్న విద్య, వైద్యం, జలవనరులు, నైపుణ్య శిక్షణ, వారసత్వ కట్టడాల పరిరక్షణ, అడవుల సంరక్షణ ఇలా ఏ విభాగానికైనా సీఎస్ఆర్ నిధులు వినియోగించవచ్చని సీఎం తెలిపారు. కంపెనీలకు కావాల్సిన సహకారాన్ని ప్రభుత్వం అందిస్తుందని చెప్పారు. కాగా, విద్యాభివృద్ధికి రహేజా గ్రూప్ రూ.50కోట్లు, రాంకీ గ్రూప్ రూ.50కోట్లు, యశోద ఫౌండేషన్ రూ.10కోట్ల చొప్పున కేటాయించేందుకు ముందుకువచ్చాయన్న సీఎం వారికి అభినందనలు తెలిపారు. ఈ సమావేశంలో పాల్గొన్న కంపెనీల ప్రతినిధులు స్పందిస్తూ.. సీఎస్ఆర్ నిధుల విషయంలో ఇప్పటివరకూ ఎవరూ ఇలా తమను సంప్రదించలేదని తెలిపారు. ఈ విషయంలో చొరవ తీసుకున్న ముఖ్యమంత్రికి అభినందనలు తెలియజేశారు. పాఠశాల విద్య, ఆస్పత్రులు, వారసత్వ కట్టడాల పరిరక్షణకు కంపెనీల ప్రతినిధులు ఆసక్తి చూపారు. ఈ సమావేశంలో రహేజా ఫౌండేషన్ తరపున శ్రావణ్ కుమార్, రాంకీ నుంచి దాక్షాయణి ఆళ్ల, యశోద ఆస్పత్రికి చెందిన డాక్టర్ గోరుకంటి సురేందర్‌రావు, గోరుకంటి ఫల్గుణ్‌రావు, మేఘా నుంచి సుధారెడ్డి, అపోలో తరపున అపర్ణారెడ్డి, కామినేని భాస్కర్‌రెడ్డి, ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ నుంచి శేఖర్‌రెడ్డి, నాదం ఫౌండేషన్ నుంచి పగిడిపాటి దేవయ్య, మిగతా 2లో..





# నేడు జీవన్‌రెడ్డితో కేటీఆర్ భేటీ!

• మాజీ మంత్రి ఇంటికి వెళ్లనున్న వర్కింగ్ ప్రెసిడెంట్
• బీఆర్ఎస్‌లోకి లాంఛనంగా ఆహ్వానించనున్న కేటీఆర్

**జగిత్యాల, (వార్త వేదిక సూర్య)-ఏప్రిల్ 8:**

జగిత్యాలకు చెందిన సీనియర్ నాయకుడు, ఇటీవలే కాంగ్రెస్‌కు రాజీనామా చేసిన మాజీమంత్రి జీవన్‌రెడ్డితో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీమంత్రి కేటీఆర్ గురువారం జగిత్యాలలో భేటీ కానున్నారు. కేటీఆర్‌తో పాటు ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, కీలక నాయకులు సైతం జీవన్‌రెడ్డి ఇంటికి రానున్నారు. రాష్ట్ర రాజకీయాలపై చర్చించిన అనంతరం ఆయనను పార్టీలోకి లాంఛనంగా కేటీఆర్ ఆహ్వానించనున్నారు. 1984లో కాంగ్రెస్‌లో మిగతా 2లో..






# మూడు రాష్ట్రాల్లో నేడు అసెంబ్లీ పోరు

• కేరళ, అస్సాం, పుదుచ్చేరికి ఒకే విడతలో పోలింగ్
• అన్ని ఏర్పాట్లు పూర్తి
• మే 4న ఫలితాలు

**న్యూఢిల్లీ:** అస్సాం, కేరళ, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల సంగ్రామం తుది అంకానికి చేరుకుంది. గురువారం రెండు రాష్ట్రాలు, ఒక యూటీలో ఒకే దశలో చేపడుతున్న పోలింగ్‌లో.. దాదాపు 5.3 కోట్లమంది ఓటర్లు ఆయా పార్టీల భవితవ్యాన్ని నిర్ణయించనున్నారు. అస్సాంలో ద్విముఖ పోరు, కేరళలో మిగతా 2లో..

# మతంలోని మూఢ నమ్మకంపై విచారించే హక్కు మాకుంది!

• శబరిమల కేసులో సుప్రీంకోర్టు
• మతపరమైన ఆచారాన్ని మూఢనమ్మకంగా కోర్టులు నిర్ధారించలేవన్న కేంద్రం

2 లో..



మిగతా 2లో..

# 2 వారాలు సీజ్‌ఫైర్..

(మొదటి పేజీ తరువాయి)

**హెజ్బొల్లాపై యుద్ధం.. ఒప్పందంలోకి రాదు**

ఇరాన్‌తో అమెరికా కాల్పుల విరమణ ఒప్పందానికి బుధవారం ఉదయం మద్దతు పలికిన ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు.. హెజ్బొల్లాతో తమ యుద్ధం ఈ ఒప్పందం పరిధిలోకి రాదని తేల్చిచెప్పారు. లెబనాన్‌లో దాడులు కొనసాగుతాయని ఇజ్రాయెల్ సైన్యం కూడా తర్వాత ప్రకటించింది. అయితే కాల్పుల విరమణకు తాము కట్టుబడి ఉంటామన్న విషయాన్ని హెజ్బొల్లా ధృవీకరించలేదు. ఒప్పందాన్ని కుదిర్చే అవకాశాన్ని మధ్యవర్తులకు ఇవ్వడానికి సిద్ధమని మాత్రం హెజ్బొల్లా తెలిపింది.

**10 నిమిషాలు.. 100 దాడులు..**

అమెరికా-ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం (సీజ్ ఫైర్ డీల్) కుదిరినప్పటికీ.. పశ్చిమాసియాలో బుధవారం కూడా దాడులు కొనసాగాయి. లెబనాన్‌పై ఇజ్రాయెల్ విరుచుకుపడింది. 10 నిమిషాల వ్యవధిలోనే ఏకంగా 100 వైమానిక దాడులు జరిపింది. ఈ దాడుల్లో 200 మందికి పైగా మృత్యువాతపడగా.. 700 మంది క్షతగాత్రులయ్యారు. 1982 తర్వాత లెబనాన్‌పై ఇదే అతి పెద్ద దాడి అని అధికారులు తెలిపారు. మరోవైపు, ఇరాన్‌లోని ఓ చమురు శుద్ధి కేంద్రంపై దాడులు జరగ్గా.. దీనికి ప్రతిగా కువైట్, యూఏఈ, సౌదీ అరేబియా, బహ్రెయిన్‌పై ఇరాన్ డ్రోన్లతో విరుచుకుపడింది.

**భీతావహంగా లెబనాన్**



లెబనాన్‌పై ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్ (ఐడీఎఫ్) భీకర దాడులు జరిపింది. బీరుట్, దక్షిణ లెబనాన్, బెకా నగరాలతో పాటు హెజ్బొల్లా ఉపయోగించే కమాండ్ అండ్ కంట్రోల్ కేంద్రాలు, స్థావరాలు, ఇతర మౌలిక సదుపాయాలే లక్ష్యంగా 10 నిమిషాల వ్యవధిలోనే 100 ఎయిర్‌స్ట్రైక్స్ చేసింది. ఈ భీకర దాడుల్లో 89 మంది ప్రజలు మృత్యువాతపడ్డారు. 700 మందికి పైగా క్షతగాత్రులయ్యారు. ఈ దాడుల్లో లెబనాన్‌లోని ప్రముఖ మత పెద్ద సాధిక్ అలీ నబుల్సీ మృతి చెందారు. 1982 తర్వాత లెబనాన్‌పై జరిగిన అతిపెద్ద దాడి ఇదేనని అధికారులు తెలిపారు. దాడులు జరిగిన ప్రాంతాల్లో అంబులెన్సులు, వైద్య సిబ్బంది, పోలీసులు, అధికారులు సహాయక చర్యలు చేపట్టినట్టు రెడ్‌క్రాస్ వెల్లడించింది. క్షతగ్రాత్రులతో లెబనాన్‌లోని అన్ని దవాఖానలు నిండిపోయినట్టు ఆరోగ్యమంత్రి తెలిపారు. పౌర సమాజంలో హెజ్బొల్లా పాతుకుపోవడాన్ని లెబనాన్ ప్రభుత్వం, అక్కడి ప్రజలు వ్యతిరేకించాలని ఐడీఎఫ్ ఒక ప్రకటనలో తెలిపింది. లేకపోతే, ఇలాంటి పరిస్థితులు పునరావృతమవుతాయని హెచ్చరించింది. మరోవైపు, ఇజ్రాయెల్ దాడులను నిలుపుదల చేసేందుకు సాయం చేయాలని మిత్ర దేశాలకు లెబనాన్ ప్రధాని నవాఫ్ సాలమ్ విజ్ఞప్తి చేశారు. ఇరాన్-అమెరికా మధ్య కాల్పుల విరమణ ఒప్పందాన్ని తాము స్వాగతిస్తున్నామన్న సాలమ్.. తాము కూడా ఈ ఒప్పందంలో భాగమైనట్టు తెలిపారు. అయినప్పటికీ, ఇజ్రాయెల్ ఇలా విరుచుకుపడటమేంటని ప్రశ్నించారు. లెబనాన్‌పై ఇజ్రాయెల్ జరిపిన దాడులపై హెజ్బొల్లా ఇంకా స్పందించలేదు.

**కొనసాగిన దాడులు**

ఒకవైపు కాల్పుల విరమణ ఒప్పందం కుదిరినప్పటికీ, మరోవైపు పశ్చిమాసియా.. దాడులు ప్రతిదాడులతో బుధవారం కూడా దద్దరిల్లింది. ఇరాన్‌లోని లావన్ ద్వీపంలో ఉన్న ఓ ఆయిల్ రిఫైనరీపై దాడులు జరిగాయి. దీంతో అక్కడ పెద్దయెత్తున మంటలు చెలరేగాయి. ఈ దాడులు ఎవరు చేశారన్న విషయం తెలియరానప్పటికీ, ఇజ్రాయెల్-అమెరికా దళాలే ఈ పనిచేసినట్టు ఇరాన్ ఆరోపిస్తున్నది. తమపై దాడులకు ప్రతిగా ఇరాన్ గల్ఫ్ దేశాలపై విరుచుకుపడింది. కువైట్‌లోని పలు చమురు, విద్యుత్తు క్షేత్రాలపై ఇరాన్ డ్రోన్లతో దాడులు జరిపింది. ఈ దాడుల్లో భారీగా ఆస్తి నష్టం సంభవించింది. అటు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని కొన్ని ప్రాంతాలపై కూడా ఇరాన్ క్షిపణులతో విరుచుకుపడింది.

**సీజ్‌ఫైర్ డీల్‌లో లెబనాన్ లేదు: ట్రంప్**

ఇరాన్‌తో తాము చేసుకొన్న కాల్పుల విరమణ ఒప్పందంలో లెబనాన్ భాగం కాలేదని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తెలిపారు. హెజ్బొల్లా కారణంగానే ఈ డీల్‌కు లెబనాన్‌ను దూరంగా పెట్టామని పేర్కొన్నారు. లెబనాన్‌పై ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడులను ప్రస్తావించగా ఆయన ఈ మేరకు స్పందించారు. లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు ప్రస్తుత సీజ్ ఫైర్ డీల్‌తో సంబంధంలేనివని తేల్చి చెప్పారు.

## మూడు రాష్ట్రాల్లో నేడు అసెంబ్లీ పోరు

(మొదటి పేజీ తరువాయి)

సైద్ధాంతిక పోరు, పుదుచ్చేరిలో బహుముఖ పోటీపై నేడు ఓటర్ల తీర్పు చెప్పనున్నారు. రెండు రాష్ట్రాలు, ఒక యూటీలో పోలింగ్ ఉదయం 7 గంటలకు మొదలుకానున్నది. వేలాదిగా ఏర్పాటుచేసిన పోలింగ్ బూత్‌ల వద్ద పెద్ద ఎత్తున భద్రతా బలగాలను మోహరించగా, వెబ్‌కాస్టింగ్ వంటి ఏర్పాట్లు జరిగాయి. మే 4న ఫలితాలు వెలువడనున్నాయి.

**కేరళలో హ్యాట్రిక్ విజయంపై విజయన్ కన్ను**

140 అసెంబ్లీ స్థానాలున్న దేవభూమి కేరళలో అధికార ఎల్డీఎఫ్, విపక్ష యూడీఎఫ్ మధ్యే ప్రధాన పోటీ నెలకొన్నది. 883 మంది అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. విజయన్ సారథ్యంలోని ఎల్డీఎఫ్ వరుసగా మూడోసారి అధికారంలోకి రావాలని ఉవ్విళ్లూరుతున్నది. అయితే ప్రభుత్వ వ్యతిరేకత తమకు కలిసి వస్తుందని, రాష్ట్రంలో మళ్లీ అధికారంలోకి వస్తామని కాంగ్రెస్ సారథ్యంలోని యూడీఎఫ్ ధీమా వ్యక్తం చేస్తున్నది. రాష్ట్రంలో ఇప్పటివరకు ఖాతా తెరువని కమలం పార్టీ.. ఈ సారి ఎలాగైనా ఉనికి చాటుకోవాలని తాపత్రయపడుతున్నది. మొత్తం ఓటర్లలో 1.32 కోట్ల మంది పురుషులు, 1.39 కోట్ల మంది మహిళలు ఉన్నారు.

**అస్సాం.. ఎవరి పక్షం?**

అస్సాంలో బీజేపీ-కాంగ్రెస్ కూటమి మధ్యే ప్రధాన పోటీ నెలకొన్నది. ఇక్కడ గౌరవ్ గొగోయ్ కాంగ్రెస్‌కు నేతృత్వం వహిస్తుండగా, సీఎం హిమంత నాయకత్వంలో బీజేపీ కూటమి మూడోసారి విజయంపై కన్నేసింది. 2016లో కాంగ్రెస్ అధికారాన్ని కోల్పోగా, ఈసారి విజయం కోసం 99 స్థానాల్లో తమ అభ్యర్థుల్ని బరిలోకి దింపింది. 126 అసెంబ్లీ స్థానాలున్న ఈ రాష్ట్రంలో ఓటర్లు 2.50 కోట్ల మంది ఉండగా, దీంట్లో 1.25 కోట్ల మంది మహిళలు, 318 మంది థర్డ్ జెండర్ ఉన్నారు.

**పుదుచ్చేరిలో పాగా వేసేదెవరు?**

కేవలం 30 అసెంబ్లీ స్థానాలు.. దాదాపు 9.5 లక్షల మంది ఓటర్లు కలిగిన పుదుచ్చేరిలో పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. మొత్తం 294 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలబడ్డారు. రాష్ట్ర హోదా ప్రధాన అంశంగా ఈసారి పుదుచ్చేరి ఎన్నికల సంగ్రామం సాగింది. ఇక్కడ డబుల్ ఇంజిన్ సర్కార్ ఉన్నప్పటికీ పుదుచ్చేరిలో స్వతంత్ర పాలన లేదని కాంగ్రెస్-డీఎంకే కూటమి ఆరోపిస్తున్నది. విజయ్ రంగ ప్రవేశంతో ఈ సారి ఇక్కడ త్రిముఖ పోరు నెలకొన్నది.

## నేడు జీవన్‌రెడ్డితో కేటీఆర్ భేటీ!

(మొదటి పేజీ తరువాయి)

చేరిన జీవన్‌రెడ్డి నలభై మూడేండ్లుగా ఉత్తర తెలంగాణలోనే కీలకమైన నాయకుడిగా గుర్తింపు పొందారు. ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన జీవన్‌రెడ్డి మూడు సార్లు రాష్ట్ర మంత్రిగా పనిచేశారు. 2014లో తెలంగాణ అవతరించిన తర్వాత ఉత్తర తెలంగాణ జిల్లాల నుంచి కాంగ్రెస్ పార్టీకి చెందిన ఏకైక ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించారు. 2018లో ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమి పాలైన జీవన్‌రెడ్డి 2019లో పట్టభద్రుల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీగా గెలిచి శాసన మండలిలో ఏకైక కాంగ్రెస్ సభ్యుడిగా కొనసాగారు. జగిత్యాల నుంచి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేగా గెలిచిన డాక్టర్ సంజయ్‌కుమార్‌ను సీఎం రేవంత్‌రెడ్డి పార్టీలో చేర్చుకోవడంతో జీవన్‌రెడ్డి తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. జీవన్‌రెడ్డి వర్గానికి ప్రాధాన్యత తగ్గిపోవడం, నామినేటెడ్ పదవుల కోసం ప్రతిపాదించిన వారికి పదవులను ఇవ్వకుండా ఎమ్మెల్యే సూచించిన వ్యక్తులకు ఇవ్వడం, ప్రధాన అనుచరుల్లో ఒకరు దారుణహత్యకు గురికావడంతో జీవన్‌రెడ్డి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో జగిత్యాల, రాయికల్ పట్టణాల్లో జీవన్‌రెడ్డి వర్గానికి చెందిన వారిని కాంగ్రెస్ పక్కన పెట్టడంతో తీవ్ర ఆవేదనకు లోనైన జీవన్‌రెడ్డి గత నెల 25న కార్యకర్తలు, నాయకుల సమక్షంలో కాంగ్రెస్‌కు రాజీనామా చేశారు.

**బీఆర్‌ఎస్‌కి వెళ్లాలని కార్యకర్తల అభిలాష**

జీవన్‌రెడ్డి అనుచరులు, కార్యకర్తలు, సన్నిహితులతో పలుసార్లు ఏ పార్టీలో చేరితే బాగుంటుందన్న విషయమై అంతర్గత సమావేశాలు నిర్వహించారు. తెలంగాణ ఉద్యమనేత కేసీఆర్, మాజీమంత్రి కేటీఆర్ నేతృత్వంలో బీఆర్‌ఎస్ బలంగా ఉందని, ప్రజల ఆశయాలు, లక్ష్యాలు నెరవేర్చడానికి అందులోకి వెళ్లడమే సరైన చర్య అంటూ కార్యకర్తలు పేర్కొనడంతో జీవన్‌రెడ్డి బీఆర్‌ఎస్‌తో ప్రయాణాన్ని కొనసాగించాలని నిర్ణయించుకున్నారు.

**జీవన్‌రెడ్డితో భేటీ కానున్న కేటీఆర్**



కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ సైతం జీవన్‌రెడ్డి బీఆర్‌ఎస్‌లోకి వస్తానంటే తన భుజాలపై మోసుకువస్తానంటూ ప్రకటించారు. పది రోజుల క్రితమే బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జీవన్‌రెడ్డితో ఫోన్‌లో చర్చలు జరిపినట్లు సమాచారం. బిజినెస్ సమ్మిట్ కోసం అమెరికా వెళ్తున్నానని, తిరిగి వచ్చిన తర్వాత జగిత్యాలలో జీవన్‌రెడ్డి ఇంటికి వచ్చి కలుస్తానని కేటీఆర్ పేర్కొన్నట్టు వార్తలు వెలువడ్డాయి. గురువారం మధ్యాహ్నం 2.30 గంటలకు జీవన్‌రెడ్డి ఇంటికి కేటీఆర్ వస్తున్నట్టు బీఆర్‌ఎస్ శ్రేణులు ప్రకటించాయి. కేటీఆర్‌తో పాటు ఉమ్మడి జిల్లాకు చెందిన బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, కీలక నాయకులు సైతం జీవన్‌రెడ్డి ఇంటికి రానున్నారు. జీవన్‌రెడ్డితో రాష్ట్ర రాజకీయాలపై చర్చించిన అనంతరం ఆయనను పార్టీలోకి లాంఛనంగా కేటీఆర్ ఆహ్వానించనునున్నారు.

**అభిమానులు అందుబాటులో ఉండాలని పిలుపు**

బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులందరూ గురువారం జీవన్‌రెడ్డి ఇంటికి వస్తున్న నేపథ్యంలో కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులందరూ అందుబాటులో ఉండాలని జీవన్‌రెడ్డి పిలుపునిచ్చారు. కేటీఆర్‌కు, బీఆర్‌ఎస్ నాయకులకు సాదర ఆహ్వానం పలకాలని కోరుతూ, మెసేజ్‌లు పంపించారు.

## ఘోష్ కమిషన్‌పై 22న తీర్పు

హైదరాబాద్, (వార్త వేదిక సూర్య)-ఏప్రిల్ 8:

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవకతవకలు జరిగినట్టు వచ్చిన ఆరోపణలపై విచారణకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌పై తీర్పును హైకోర్టు 22కు వాయిదా వేసింది. ముందుగా ప్రకటించిన మేరకు బుధవారం హైకోర్టు తీర్పు వెలువరించాల్సి ఉన్నది. తీర్పు సిద్ధం కాలేదని, ఈ నెల 22న తీర్పు వెలువరిస్తామని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్‌సింగ్, జస్టిస్ జీఎం మొహియుద్దీన్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం ప్రకటించింది. ప్రభుత్వం ఘోష్ కమిషన్‌ను ఏర్పాటు చేస్తూ 2024 మార్చి 14న జారీ చేసిన జీవో 6ను కొట్టివేయాలని దాఖలైన పిటిషన్లపై విచారణను ముగించిన హైకోర్టు మార్చిన 12న తీర్పును రిజర్వు చేసింది. జీవో 6ను కొట్టివేయాలని, జస్టిస్ ఘోష్ కమిషన్ ప్రభుత్వానికి సమర్పించిన నివేదికను రద్దు చేయాలని కోరుతూ బీఆర్‌ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు, మాజీ మంత్రి టీ హరీశ్‌రావు, ఐఏఎస్ స్మితా సభర్వాల్, మాజీ ఐఏఎస్ అధికారి ఎస్‌కే జోషి వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు.



**అనాథల పేరిట నిధుల స్వాహాపై మండిపాటు**

అనాథలు, అభాగ్యుల పేరిట పలు స్వచ్ఛంద సంస్థలు నిధులు వసూలు చేసి స్వాహా చేస్తున్నాయని హైకోర్టు తీవ్రస్థాయిలో మండిపడింది. కుటుంబం ఉన్న పిల్లలను అనాథలుగా చూపించి విదేశీ నిధులను కాజేస్తున్నాయని వ్యాఖ్యానించింది. ఈ తరహా ఆరోపణలను ఎదుర్కొంటున్న ఆపరేషన్ మొబిలైజేషన్ (ఓఎం) ఆఫ్ ఇండియా గ్రూప్ ఆఫ్ చారిటీస్‌కు చెందిన ఆస్తులు అన్యాక్రాంతం చేయరాదని మధ్యంతర ఆదేశాలు జారీచేసింది. సుప్రీంకోర్టు ఆదేశాలకు విరుద్ధంగా ఆస్తులను అమ్మేయడానికి ఓఎం గ్రూప్ ఆఫ్ చారిటీస్ నిర్వాహకులు కుట్ర చేస్తున్నారంటూ సికింద్రాబాద్‌కు చెందిన గౌరిపాగ ఆల్బర్ట్ లాజెల్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యవహారాన్ని సీబీఐ దర్యాప్తునకు అప్పగించాలని కోరిన పిటిషన్‌ను జస్టిస్ నగేశ్ భీమపాక బుధవారం విచారించారు. సీనియర్ న్యాయవాది జొన్నలగడ్డ సుధీర్ వాదనలు వినిపిస్తూ, సంస్థ నిర్వహణ పారదర్శకంగా లేదని తెలిపారు. విదేశీ విరాళాల (నియంత్రణ) చట్ట ఉల్లంఘన జరుగుతున్నదని చెప్పారు. దీనిపై 2023లో దర్యాప్తు చేసినప్పటికీ విదేశీ నిధుల సేకరణ నియంత్రణ అంశం జోలికి వెళ్లలేదని తెలిపారు. అమెరికా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ తదితర దేశాల నుంచి నిధులు వస్తుంటాయని చెప్పారు. ఈడీ ఆస్తులను జప్తు చేసినప్పటికీ నిర్వాహకులు ఆస్తులను అమ్మేస్తున్నారని ఆరోపించారు. సీబీఐ తరఫు ప్రత్యేక న్యాయవాది శ్రీనివాస్ కపాటియా స్పందిస్తూ తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని తెలిపారు. వాదనల తర్వాత హైకోర్టు.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల హోంశాఖలు, సీబీఐ, డీజీపీ, సీఐడీ అదనపు డీజీ, ఓఎం గ్రూప్ ఆఫ్ చారిటీస్‌కు నోటీసులు ఇచ్చింది. అభియోగాలు ఎదుర్కొంటున్న చారిటీస్ ఆస్తులు అన్యాక్రాంతం చేయరాదని మధ్యంతర ఉత్తర్వులను జారీ చేసింది. విచారణను ఈ నెల 23కు వాయిదా వేసింది.




## సమాజాభివృద్ధికి చేయి కలపండి

(మొదటి పేజీ తరువాయి)

రుద్రమదేవి తదితరులు పాల్గొన్నారు.

**తెలంగాణలో పెట్టుబడులకు సిద్ధంగా ఉన్నాం: సీఎం రేవంత్‌ను కలిసిన టాటా లాక్‌హీడ్ సంస్థ ఎండీ**

తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నామని టాటా లాక్‌హీడ్ మార్టిన్ ఎయిరోస్ట్రక్చర్ లిమిటెడ్ (టీఎల్‌ఎంఏఎల్) ఎండీ టిమ్ రైఫెల్ ప్రకటించారు. బుధవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ఆయన భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో తమ సంస్థ కార్యాకలాపాల విస్తరణ, నూతన పెట్టుబడుల అంశంపై ఇరువురి మధ్య కీలక చర్చలు జరిగాయి. భారీ సరుకు రవాణా విమానాలైన సీ130జే సూపర్ హెర్క్యులస్ ఫైనల్ అసెంబ్లీ లైన్ (ఎఫ్ఏఎల్) యూనిట్‌ను లాక్‌హీడ్ మార్టిన్ సంస్థ భారత్‌లో ఏర్పాటుచేస్తోంది. అంతర్జాతీయ అవసరాల కోసం అమెరికాకు చెందిన ఎఫ్-16 యుద్ధవిమానాల రెక్కలను ఉత్పత్తి చేసేందుకు టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్ లాక్‌హీడ్ మార్టిన్ సంస్థ ఒప్పందం కుదుర్చుకుంది. ఈ నేపథ్యంలోనే తెలంగాణలోనూ పెట్టుబడులు పెట్టేందుకు కంపెనీ ముందుకు వచ్చింది. భారత్‌లోని రిపబ్లిక్ ఆఫ్ ఘనా హైకమిషనర్ క్వాసి ఒబిరిడాన్సో బుధవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. హైకమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా హైదరాబాద్‌కు వచ్చిన ఆయన.. సీఎంతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఘనా - తెలంగాణ మధ్య సంబంధాలు కొనసాగాలని హైకమిషనర్ ఆకాంక్షించారు. విద్య, శాస్త్ర, సాంకేతిక, ఆరోగ్య, వాణిజ్య రంగాల్లో పరస్పర సహకారం ఉండాలని కోరారు. ఈ అంశాలపై సీఎం రేవంత్ సానుకూలంగా స్పందించారని సీఎం కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది.

## 15న ఆదిచుంచనగిరికి ప్రధాని

**బెంగళూరు:** మండ్య జిల్లా నాగమంగల తాలూకాలోని చారిత్రాత్మక గుర్తింపు కల్గిన ఆదిచుంచనగిరి మఠం పీఠాధ్యక్షుడిగా కొనసాగిన బాలగంగాధరనాథస్వామిజీ సమాధిని శ్రీ గురుభైరవైక్య మందిరం ప్రారంభానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ 15వ తేదీన రానున్నారు. ప్రధానమంత్రి రాష్ట్ర పర్యటనకు సుదీర్ఘకాలం తర్వాత విచ్చేస్తున్నారు. ఆదిచుంచనగిరి పరిధిలోని కాలభైరవేశ్వరస్వామి ఆలయానికి సమీపంలోనే భైరవైక్య డాక్టర్ బాలగంగాధర నాథస్వామీజీని సమాధి చేసిన విషయం తెలిసిందే. స్వామీజీ భైరవైక్యం చెందినప్పుడు తాత్కాలికంగా మండపాన్ని నిర్మించారు. ఆ తర్వాత మూల సమాధిని యథాస్థితిలో ఉంచి మండపాన్ని తొలగించారు. రెండు అంతస్తులతో ప్రస్తుతం మందిరాన్ని తీర్చిదిద్దారు. ఈ మండపాన్ని ప్రారంభించేందుకు ప్రధానమంత్రి 15న విచ్చేయనున్నారని మఠం ఒక ప్రకటనలో పేర్కొంది. బుధవారం ఉదయం 11 గంటలకు మండపాన్ని ప్రారంభించే ప్రధానమంత్రి బీజీఎస్ స్టేడియంలో ప్రత్యేక వేదిక ద్వారా భక్తులనుద్దేశించి ప్రసంగించనున్నారు. ఆదిచుంచనగిరి మఠం ప్రస్తుత పీఠాధిపతి నిర్మలానందనాథస్వామీజీ కార్యక్రమాన్ని పర్యవేక్షించనున్నారు. కార్యక్రమంలో మాజీ ప్రధాని దేవేగౌడ, కేంద్రమంత్రి కుమారస్వామి సహ జిల్లా మంత్రి చలువరాయస్వామి, రాష్ట్రంలోని వివిధ మఠాల స్వామీజీలు పాల్గొననున్నారు. ప్రధానమంత్రి పర్యటన నేపథ్యంలో జిల్లాధికారి డాక్టర్ కుమార్, ఎస్పీ డాక్టర్ శోభారాణి మఠాన్ని సందర్శించారు.

## ఖరీఫ్ సీజన్‌లో న్యూట్రియెంట్ బేస్డ్ సబ్సిడీగా రూ.41,534 కోట్లు

**కేంద్ర క్యాబినెట్ కీలక నిర్ణయం**

**న్యూఢిల్లీ:** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన బుధవారం నాడు జరిగిన కేంద్ర క్యాబినెట్ సమావేశంలో 5 కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఖరీఫ్ సీజన్ కోసం న్యూట్రియెంట్ బేస్డ్ సబ్సిడీగా రూ.41,533.81 కోట్లు కేటాయించారు. ఇది 2025 ఖరీఫ్ సీజన్‌లో బడ్జెటరీ కేటాయింపుల కంటే రూ.4,313 కోట్ల రూపాయలు అధికం. 2025 ఖరీఫ్ బడ్జెట్ రూ.37,216.15 కోట్లుగా ఉంది. కాగా, జైపూర్ మెట్రో ఫేజ్-2కు కేంద్ర క్యాబినెట్ తాజాగా ఆమోదం తెలిపింది. రూ.13,038 కోట్లతో ఈ ప్రాజెక్టు చేపడతారు. ప్రహ్లాద్‌పుర నుంచి తోడి-మోడ్ వరకూ 36 స్టేషన్లను కలుపుతూ 41 కిలోమీటర్ల పొడవైన నార్త్-సౌత్ కారిడార్‌గా దీన్ని నిర్మించనున్నారు. కేంద్ర, రాజస్థాన్ ప్రభుత్వం జాయింట్ వెంచర్‌గా రాజస్థాన్ మెట్రో రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ దీనిని చేపడుతుంది. రాజస్థాన్‌లో హెచ్‌పీసీఎల్ రిఫైనర్ కోసం రూ.79,459 కోట్లను కేటాయిస్తూ కేంద్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. అరుణాచల్ ప్రదేశ్‌లోని కమ్లే, క్రా దాది-కురుంగ్ కుమే జిల్లాల్లో రూ.26,069.50 కోట్లతో 1720 మెగావాట్ల ఎలక్ట్రిక్ ప్రాజెక్ట్ నిర్మాణానికి కూడా మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టు 96 నెలల్లో పూర్తవుతుందని అంచనా వేశారు. కాగా, అరుణాచల్ ప్రదేశ్‌లోని అంజావ్ జిల్లాలో 1200 మెగావాట్ల కళాయి-2 హైడ్రో ప్రాజెక్టు నిర్మాణానికి రూ.14,105.83 కోట్లు కేటాయిస్తూ కేంద్ర మంత్రివర్గం మరో కీలక నిర్ణయం తీసుకుంది.

## మతంలోని మూఢ నమ్మకంపై విచారించే హక్కు మాకుంది!

**న్యూఢిల్లీ:** శబరిమల ఆలయంతో సహా మతపరమైన ప్రదేశాల్లో మహిళలపై వివక్షకు సంబంధించిన పిటిషన్లపై సుప్రీంకోర్టులో వాదోపవాదాలు వాడీవేడిగా సాగాయి. ఒకమతంలోని మూఢనమ్మకాన్ని విచారించే హక్కు, అధికార పరిధి తమకు ఉందని సుప్రీం కోర్టు న్యాయమూర్తులు పేర్కొనగా, 'అలా ఎలా కుదురుతుంది.. ఒక ప్రాంతంలోని మతపరమైన ఆచారం మరొక ప్రాంతానికి మూఢనమ్మకంగా కనపడుతుంది. ఈ అంశాలు మీ పరిధిలోకి రావు' అంటూ సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. రాజ్యాంగ ధర్మాసనం బుధవారం.. శబరిమల కేసు, వివిధ మతాల స్వేచ్ఛ పరిధి, విస్తృతి పిటిషన్లపై విచారణ చేపట్టింది. తుషార్ వాదనను జస్టిస్ అమానుల్లా తోసిపుచ్చారు. 'శాసనసభ నిర్ణయమే అంతిమం అని మీరు చెప్పలేరు' అని అన్నారు. ఆపై తుషార్ తన వాదనను కొనసాగిస్తూ, 'నాగాలాండ్‌లో ఒక ఆచారం.. నాకు మూఢ నమ్మకంగా కనిపించవచ్చు. మహారాష్ట్రలో బ్లాక్ యాక్ట్ ఉంది. అక్కడున్నది మూఢనమ్మకమేనని నిర్ధారించటం న్యాయస్థానం పరిధిలోని విషయం కాదు. ఆర్టికల్ 25(బి) ప్రకారం, ఈ విషయంలో జోక్యం చేసుకొని, చట్టాన్ని చేయాల్సిన బాధ్యత శాసనసభదే'నని అన్నారు. ఒక లౌకిక న్యాయస్థానం ఒక మతపరమైన ఆచారాన్ని కేవలం మూఢనమ్మకంగా నిర్ధారించలేదని మెహతా అన్నారు.

## పొంగులేటి కాదు.. పక్కా లూటీ

**బీఆర్‌ఎస్ నేత ఆర్‌ఎస్ ప్రవీణ్ ఫైర్**

హైదరాబాద్, (వార్త వేదిక సూర్య)-ఏప్రిల్ 8:

రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పక్కా లూటీదారే.. అధికారం ఉన్నచోటికి వెళ్లడం, ప్రభుత్వ ఆస్తులు కాజేయడంలో మేటి అని బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తెలంగాణ అమరుల స్తూపం సాక్షిగా పొంగులేటి అవినీతి, అక్రమాలను నిరూపించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, ఏమాత్రం చీమూనెత్తురు, దమ్మూధైర్యం ఉన్నా రెవెన్యూ రికార్డులతో చర్చకు రావాలంటూ సవాల్ విసిరారు. లేకపోతే ప్రభుత్వ ఆస్తులను కాపాడడంలో విఫలమైనందుకు నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అయినా ఆయనకు బోర్డులు తిప్పేయడం.. పారిపోవడం అలవాటేనని ఎద్దేవా చేశారు. బుధవారం తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్‌కుమార్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు.

# తెలంగాణ రైతు సంఘం నూతన జిల్లా అధ్యక్ష కార్యదర్శులుగా మేక అశోక్ రెడ్డి, మాటూరి బాలరాజ్ గౌడ్

యాదాద్రి భువనగిరి ఏప్రిల్ 8 వార్తా వేదిక సూర్య

బితెలంగాణ రైతు సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా మూడవ మహాసభలు ఏప్రిల్ 6, 7 తేదీల్లో పోచంపల్లి పట్టణంలోని బాలాజీ ఫంక్షన్ హాల్ లో నిర్వహించారు. ఈ మహాసభలకుముఖ్య అతిథులుగా, ఆల్ ఇండియా కిసాన్ సభ జాతీయ కమిటీ సభ్యులు మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు పోతినేని సుదర్శన్, తీగల సాగర్ లు పాల్గొని మహాసభల్లో ప్రసంగించారు రెండు రోజులపాటు జరిగిన ఈ మహాసభల్లో జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన పోరాటాలని సాధించిన విజయాలని చర్చించుకున్నారు. మహాసభలో జిల్లా వ్యాప్తంగా భవిష్యత్తులోనిర్వహించాల్సిన, సాగునీటి ప్రాజెక్టులై న బస్వాపురం ప్రాజెక్టు, రాచకొండ ఎత్తిపోతల లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్, మూసి కాల్వలకు గోదావరి జలాలను లింకు చేసి పిల్లాయపల్లి, ధర్మారెడ్డి పల్లి అసిఫ్ నహర్, బొల్లేపల్లి కాల్వ, పునాది గాని కాల్వలకు గోదావరి జలాలను లింకు చేసి అందించాలని ఈ మహాసభల్లో తీర్మానాలని ఆమోదించారు. బస్వాపురం ప్రాజెక్టులో భూములు కోల్పోయిన రైతులకు మార్కెట్ రేటు ప్రకారం నష్టపరిహారం ఇవ్వాలని, చిన్న నీటి వనరులైన పునాది గాని కాలువ ధర్మారెడ్డి పల్లి కాల్వ, పిల్లాయిపల్లి కాల్వలు పూర్తిచేసి ఫీడర్ ఛానల్ ద్వారా చెరువులో కుంటలు నింపి నష్టపరిహారం ఇవ్వని రైతులకు మార్కెట్ రేటు ప్రకారం నష్టపరిహారం ఇవ్వాలని, నిధులు కేటాయించి భూభారతి లోపాలని, రెండు లక్షల రూపాయల రుణమాఫీ కానీ రైతులందరికీ రుణమాఫీ చేయాలని, కౌలు రైతులకు క్రెడిట్ కార్డు ఇచ్చి రుణాలు ఇవ్వాలని తీర్మానించారు.




అనంతరం మహాసభ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు జిల్లా అధ్యక్షులుగా మేక అశోక్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శిగా మాటూరి బాలరాజు గౌడ్ ఉపాధ్యక్షులుగా ఎండి జహంగీర్, బూరుగు కృష్ణారెడ్డి, చీరిక వేలు, కందాడి సత్తిరెడ్డి, సహాయ కార్యదర్శిగా కోట రామచంద్రారెడ్డి, దోడ యాదిరెడ్డి, గన్నె బోయిన విజయ భాస్కర్ పైళ్ళయాదిరెడ్డి, ఏదునూరి మల్లేశం తోపాటు జిల్లా కమిటీ సభ్యులుగా తుమ్మల నర్సిరెడ్డి, సూద గాని సత్య రాజయ్య, పిక్క గణేష్, బోయిని ఆనంద్, చీరిక సంజీవరెడ్డి, పొట్ట శ్రీనివాస్, ఆకుల ధర్మయ్య, ర్యాకల శ్రీశైలం ,బొమ్మ గాని శంకరయ్య, జిట్టా అంజిరెడ్డి, పగిళ్ల లింగారెడ్డి, గూడూరు బుచ్చిరెడ్డి, దడిపల్లి ప్రభాకర్, రేసు రామచంద్రారెడ్డి, మొగిలి పాక గోపాల్, సురకంటి శ్రీనివాస్ రెడ్డి, కొమ్ము మల్లేశం, పుష్పలత, చింతల రజిని, బందెల ఎల్లయ్య తుమ్మల సత్యనారాయణ రెడ్డి, కందుల మల్లారెడ్డి, పానుగుల్ల రమేష్, కొమ్ము అంజమ్మ 35 మందితో జిల్లా కమిటీని మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు





## సంతల నిలిపివేతతో ఇబ్బందుల్లో చిరు వ్యాపారులు

### ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ భరోసా

మైలర్ దేవ్ పల్లి, ఏప్రిల్ 08 ( వార్త వేదిక సూర్య ) :

నార్సింగి సర్కిల్ పరిధిలోని పుప్పాలగూడ మరియు పరిసర గ్రామాల్లో రహదారులపై నిర్వహిస్తున్న సంతలను మున్సిపల్ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు నిలిపివేయడంతో చిరు వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రద్దీ ప్రాంతాల్లో సంతల నిర్వహణ వల్ల ట్రాఫిక్ సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో పోలీసులు మున్సిపల్ అధికారులకు లేఖ రాయడంతో ఈ చర్యలు తీసుకున్నట్లు తెలిసింది. సంతల నిలిపివేతతో ఉపాధి కోల్పోయిన చిరు వ్యాపారులు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ని, మున్సిపల్ కమిషనర్‌ను కలిసి తమ సమస్యలను వినిపించారు. తమకు వేరే ఉపాధి లేకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, సంవత్సరాలుగా కూరగాయల విక్రయంతోనే జీవనం సాగిస్తున్నామని వారు తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ, రోడ్లపై అనధికారికంగా దుకాణాలు ఏర్పాటు చేయడం వల్ల ట్రాఫిక్ సమస్యలు తీవ్రంగా పెరుగుతున్నాయని చెప్పారు. రోడ్లకు ఇరువైపులా పార్కింగ్ స్థలం లేకపోవడం, చెత్తను అక్కడే వదిలేయడం వల్ల ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయని తెలిపారు. అయితే, చిరు వ్యాపారుల జీవనోపాధి దృష్ట్యా త్వరలోనే గుర్తింపు కార్డులు జారీ చేసి, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ స్పందిస్తూ, తాత్కాలికంగా వ్యాపారం కొనసాగించేందుకు అనుమతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటానని చెప్పారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా వ్యాపారం నిర్వహించే విధంగా అధికా రులతో చర్చిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో చిరు వ్యాపారులు, మాజీ కౌన్సిలర్ ఉషారాణి పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల గోస పట్టదా..

### అధికారుల మొండివైఖరి వీడాలి!

- సెన్సస్-2027 విధుల్లో సీనియార్టీకి పాతర..

టీఎస్‌యూటీఎఫ్ ఆగ్రహం

- మహిళలు, అనారోగ్య బాధితులకు

మినహాయింపు ఇవ్వాలని ఎంఈఓకు వినతి

మైలర్ దేవ్ పల్లి ఏప్రిల్ 08 ( వార్త వేదిక సూర్య ) :



మండలంలోని ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యల పట్ల విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యం వహించడం తగదని, తక్షణమే వాటిని పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ మండల కమిటీ డిమాండ్ చేసింది. బుధవారం మండల విద్యాధికారి (ఎంఈఓ) శంకర్ రాథోడ్‌ను కలిసి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. సీనియార్టీనిగాలికొదిలేస్తారా? ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ.. రాబోయే సెన్సస్-2027 విధుల్లో సీనియార్టీని పరిగణనలోకి తీసుకోకుండా సూపర్‌వైజర్ల నియా మకం చేపట్టడం అన్యాయమని మండిపడ్డారు. ఉపాధ్యాయులు ప్రస్తుతం పనిచేస్తున్న ప్రాంతాల్లోనే విధులను కేటాయిస్తే గణన ప్రక్రియ ఎటువంటి ఆటంకాలు లేకుండా సులభంగా జరుగుతుందని అధికారులకు వివరించారు. మానవతా దృక్పథం ఏది? తీవ్ర అనారోగ్యంతో ఉ న్నవారు, మహిళా ఉపాధ్యాయుల పట్ల అధికారులు మానవతా దృక్పథంతో వ్యవహరిం చాలని కోరారు. వారికి సెన్సస్ విధులనుండి మినహాయింపు కల్పించాలని, లేనిపక్షంలో ఉపాధ్యాయ లోకం తరపున ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఉపాధ్యాయుల విన్నపంపై స్పందించిన ఎంఈఓ శంకర్ రాథోడ్, సమస్యలను ఉ న్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, సానుకూల నిర్ణయం తీసుకుంటానని హామీ ఇచ్చారు. ముఖ్యంగా సెన్సస్ విధుల కేటాయింపులో ఉ పాధ్యాయులకు ఇబ్బంది కలగకుండా చూస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు బి. యాదగిరి, ఉపాధ్యక్షుడు సాధత్ అలీ, ప్రధాన కార్యదర్శి ఎ. మహేశ్వర్, నాయకులు సీత్య నాయక్, ప్రభాకర్, ఖాలీదు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యలను పరిష్కరించడమే నా లక్ష్యం మాజీ కార్పొరేటర్ - కొంతం దీపిక నరేష్



ప్రజల సమస్యలను పరిష్కరించడమే తమ లక్ష్యమని మోండా మార్కెట్ డివిజన్ మాజీ కార్పొరేటర్ కొంతం దీపిక నరేష్ అన్నారు. బుధవారం సెకండ్ బజార్ మరియు చాపల బావి ప్రాంతాల్లో గత కొన్ని రోజులుగా పరిశుద్ధ సమస్యలు ఎదుర్కొంటున్న నేపథ్యంలో వెంటనే ఈ విషయం తెలుసుకున్న మాజీ కార్పొరేటర్ కొంతం దీపిక నరేష్ పర్యటించి బోయినపల్లి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డాకు నాయక్ దృష్టికి తీసుకొనివెళ్లారు. ఆయన వెంటనే స్పందించి సమస్యను అధికారులతో మాట్లాడి వీలైనంత త్వరగా పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం పరిశుద్ధ శానిటేషన్ డిఈఈ సందీప్, సూపర్వైజర్ ధన గౌడ్, జవాన్లు, ఆంజనేయులు, శ్రీకాంత్, బాలకృష్ణ తో కలసి పరిశుద్ధ సమస్యలను పరిశుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు జితూగుప్తా, ప్రశాంత్ జైన్, గణేష్, నర్సింగ్, సాయి తదితరులు పాల్గొన్నారు

## అస్సోనిగూడెం ప్రాథమిక పాఠశాలలో వార్షికోత్సవ సంబరాలు




చౌటుప్పల్ ఏప్రిల్ 8 వార్తావేదిక సూర్య

చౌటుప్పల్ మండలం అస్సోనిగూడెంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో వార్షికోత్సవ సంబరాలు బుధవారం నిర్వహించారు. ఏ.ఏ.పి.సి చైర్మన్ నక్క అరుణ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎన్. శోభ, ఉ పాధ్యాయుడు వై .అశోక్ కుమార్, విద్యార్థుల తల్లిదండ్రులు సరస్వతి దేవి చిత్రపటానికి జ్యోతి ప్రజ్వలన చేసి వార్షికోత్సవాన్ని ప్రారంభించారు. ప్రధానోపాధ్యాయురాలు ఎన్. శోభ వార్షిక నివేదికను సమర్పించారు. విద్యార్థులందరికీ గుణాత్మకమైన విద్యను అందిస్తూ ప్రభుత్వం చేపట్టే అన్ని రకాల విద్యాపరమైన కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. పాఠశాల అభివృద్ధికి తోడ్పాటునందిస్తున్న ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థిని,విద్యార్థులు వివిధ రకాల ఆట పాటలతో ప్రేక్షకులను ఆనందింపజేశారు , సోది చెప్తామమ్మా సోది చెప్తామనే నాటకీకరణ ద్వారా ఎరుకల నాంచారమ్మ గా ఐదవ తరగతి విద్యార్థిని సాత్విక అభినయించారు.

ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు స్థానిక ఎమ్మెల్యే , గ్రామపంచాయతీ నూతన పాలకవర్గం , ఏ.ఏ.పి.సి చైర్మన్, విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు, గతంలో ఈ పాఠశాలలో చదివిన యువతీ, యువకులు, పాఠశాల ఉపాధ్యాయ బృందం పాఠశాల అభివృద్ధికి చేస్తున్న కృషిని,ఈ ప్రభుత్వ బడిలో చదివి ఏ.ఈ.ఓ గా సెలెక్ట్ అయిన వారి గురించి,

ప్రభుత్వ బడిలో చదివిన గొప్ప గొప్ప వ్యక్తుల గురించి వివరిస్తూ మన గ్రామంలోని బడి ఈడు కలిగిన పిల్లలంతా మన ఊరి బడిలోనే చదవాలని నాటకీకరణ ద్వారా తెలియజేయడం జరిగింది. పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమాన్ని విద్యార్థుల తల్లిదండ్రులతో, గ్రామ యువతి,యువకులు వీక్షించారు. చక్కటి విద్యా బోధన చేస్తున్నందుకు ఉపాధ్యాయులను అభినందించారు.

## పత్తి రాజుకు రాష్ట్ర స్థాయి పదవి..

### పంబాల రాజుకు అసెంబ్లీ ఇన్‌చార్జ్ బాధ్యతలు

మైలర్ దేవ్ పల్లి, ఏప్రిల్ 08 ( వార్త వేదిక సూర్య) :

సామాజిక సేవా కార్యక్రమాల్లో నిరంతరం శ్రమిస్తూ, బడుగు, బలహీన వర్గాల సమస్యలపై పోరాడే నాయకులకు గుర్తింపు లభించడం అభినంద నీయమని పలువురు నేతలు కొనియాడారు. రాజేంద్రనగర్‌లోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో బుధవారం ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఇటీవల ఎస్సిఆర్పిఎస్ సొసైటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన పత్తి రాజును పార్టీ శ్రేణులు ఘనంగా సన్మానించారు. సామాజిక సంక్షేమ రంగంలో ఆయన అందిస్తున్న సేవలను ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. అదేవిధంగా, అంబేద్కర్ బస్తీకి చెందిన యువ నాయకుడు పంబాల రాజును నేషనల్ అంబేద్కర్ సేన రాజేంద్రనగర్ అసెంబ్లీ ఇన్‌చార్జ్‌గా నియామకమైన సందర్భంగా నేతలు అభినందించారు. ప్రజా సమస్యల పట్ల నిరంతరం స్పందించే గుణం పంబాల రాజుకు ఉందని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. బాధ్యతాయుతమైన పదవులను చేపట్టిన వీరిద్దరూ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ప్రజా సేవలో రాజీ పడకుండా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గోల్కొండ, గోషామహల్ ఇన్‌చార్జ్ వై. శ్రీధర్ జి, బాబురావు, భీమయ్య, పెంటయ్య, ఎన్. రవీందర్, జ్ఞానేశ్వర్, ఎన్. స్వామి, రఘుమారెడ్డి, రాములు, నార్సింగి మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఏర్పుల కుమార్, అనీస్, బి. రాజు తదితరులు పాల్గొన్నారు.

## మైలార్‌దేవ్‌పల్లిలో కల్తీ స్నాక్స్ గుట్టురట్టు!




### 'కరాచీ పోలో', 'రింగ్ లైట్' బ్రాండ్ల పేరిట విషపూరిత ఆహారం తయారీ హెచ్ -ఫాస్ట్ బృందం మెరుపు దాడి.. భారీగా నిల్వలు సీజ్

మైలర్ దేవ్ పల్లి, ఏప్రిల్ 08 ( వార్త వేదిక సూర్య) :

ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్న అక్రమ ఆహార తయారీ కేంద్రాల పై అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో అత్యంత అపరిశుభ్ర వాతావరణంలో, ప్రాణాంతక రసాయనాలతో స్నాక్స్ తయారు చేస్తున్న ఒక యూనిట్‌ను హెచ్ -ఫాస్ట్ బృందం బుధవారం రట్టు చేసింది. విశ్వసనీయ సమాచారం మేరకు మైలార్ దేవ్‌పల్లిలోని ఒక తయారీ కేంద్రంపై అధికారులు ఆకస్మిక దాడి నిర్వహించారు. అక్కడ "కరాచీ పోలో" మరియు "రింగ్ లైట్" అనే పేర్లతో స్నాక్స్ తయారు చేస్తున్నారు. ఈ కేంద్రంలో కనీస నాణ్యతా ప్రమాణాలు పాటించకపోగా, తయారీ విధానం చూసి అధికారులు విస్తుపోయారు.

ఈగలు, మురికి పేరుకుపోయిన వాతావరణంలో ఆహార పదార్థాలను తయారు చేస్తున్నట్లు గుర్తించారు. చిన్నారులు ఇష్టంగా తినే ఈ స్నాక్స్‌లో తక్కువ నాణ్యత కలిగిన నూనెలు మరియు విషపూరితమైన రంగులు, రసాయనాలను వాడుతున్నట్లు అధికారులు నిర్ధారించారు. ఇవి నేరుగా ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. దాడి సమయంలో భారీ మొత్తంలో ఉన్న స్టాక్‌ను స్వాధీనం చేసుకున్న అధికారులు, వాటిని ల్యాబ్‌కు తరలించారు. ఈ ఘటనపై మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రజారోగ్యానికి విఘాతం కలిగిస్తే సహించేది లేదని అధికారులు స్పష్టం చేశారు. తమ పిల్లలు తినే ఆహారం విషయంలో తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలని పోలీసులు సూచించారు.



# సమ్మె సైరన్ మోగించిన విద్యుత్ ఆర్టిసన్ ఉద్యోగులు





- విధులను బహిష్కరించి పోరాట బాట పట్టిన సిబ్బంది
- సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి
- ప్రభుత్వానికి కఠిన హెచ్చరిక

మైలర్ దేవ్ పల్లి, ఏప్రిల్ 08 ( వార్త వేదిక సూర్య ) :
తెలంగాణ విద్యుత్ రంగంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. తమ హక్కుల కోసం ఆర్టిసన్ ఉద్యోగులు సమ్మె సైరన్ మోగించి విధులను బహిష్కరించారు. సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగ భద్రత, న్యాయమైన విధానాల అమలే లక్ష్యంగా పోరాటాన్ని ఉధృతం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా పనిచేస్తున్న ఆర్టిసన్ సిబ్బంది ఆరు ప్రధాన డిమాండ్లను ముందుకు తెచ్చి ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు. విద్యార్హతల ఆధారంగా ఉద్యోగాల కన్వర్షన్, పాత ఏపీఎస్ఇబి సర్వీస్ రూల్స్ అమలు, అవుట్‌సోర్సింగ్ కార్మికులకు ఆర్టిసన్ హోదా, పీస్ రేట్ కార్మికులకు కనీస వేతనాలు, 2026 పీఆర్సీ అమలు వంటి కీలక అంశాలపై తక్షణ నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. 2016 డిసెంబర్ కట్ ఆఫ్ తేదీ కారణంగా వేలాది మంది అన్యాయానికి గురయ్యారని, సంవత్సరాలుగా పనిచేస్తున్న కార్మికులను పక్కన పెట్టడం అమానుషమని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒకే పని -- రెండు విధానాలు ఎందుకు? అంటూ ప్రభుత్వ వైఖరిపై తీవ్రంగా మండిపడ్డారు. ఆర్టిసన్ ఉద్యోగుల శ్రమ వల్లే నేడు విద్యుత్ సరఫరా మెరుగ్గా కొనసాగుతోందని, కానీ తమకు మాత్రం గుర్తింపు లేకపోవడం బాధాకరమని వారు తెలిపారు. వినియోగదారులపై ప్రేమతోనే ఇంతకాలం నిబద్ధతతో పనిచేశామని, కానీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఇప్పుడు పోరాటం తప్పలేదని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో 10 యూనియన్లు కలిసి తెలంగాణ విద్యుత్ ఆర్టిసన్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీవీఏజేఏసీ)గా ఏర్పడి సమ్మెను మరింత ఉధృతం చేశాయి.మా డిమాండ్లు పరిష్కరించకపోతే పోరాటం మరింత తీవ్రం అవుతుంది.





## అరేకంటి(గడ్డం) రాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించిన బి ఆర్ ఎస్ రాష్ట్ర నాయకులు

దేవరకొండ ఏప్రిల్ 8 (వార్త వేదిక సూర్య):-
నేరడగొమ్ము మండలం కేంద్రం డిసెంబర్ నెలలో జరిగిన స్థానిక సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన ఆరెకంటి విజయ్ తండ్రిగారైన ఆరెకంటి (గడ్డం) రాములు దశదినకర్మలో పాల్గొన్న బి ఆర్ ఎస్ రాష్ట్ర నాయకులు కేతావత్ బిల్ అనే కిషన్ నాయక్ కేతావత్ బిల్యా నాయక్ కిషన్ నాయక్ పాల్గొని అయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు ఈ కార్యక్రమం లో మాజీ వైస్ ఎంపీపీ ఆరెకంటి రాములు , కేతావత్ హరిలాల్ నాయక్ , ముక్కామల్ల బాలయ్య , పల్స వెంకటయ్య , నరసింహ నాగరాజు , బైకాని సాలయ్య ,వెంకటయ్య , ముక్కామల్ల ఆంజనేయులు , కొత్త ఆంజనేయులు , బూడిద పాక నాగరాజు , సైదయ్య, తదితరులు పాల్గొన్నారు

## నూతన వధూవరులను ఆశీర్వదించిన నల్లగొండ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ బి ఆర్ ఎస్ రాష్ట్ర పార్టీ నాయకులు కేతవత్ బిల్యానాయక్

దేవరకొండ ఏప్రిల్ 8 ( వార్తా వేదిక సూర్య ):-





చింతపల్లి మండలం లోని తీదేడు గ్రామానికి చెందిన దాసరి వెంకటయ్య - పద్మ గార్ల కుమార్తె అనూష జయ ప్రకాష్ రాజ్ గార్ల వివాహ వేడుకలో నల్లగొండ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కేతావత్ బిల్య నాయక్,బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఉలుపాల శేఖర్ రెడ్డి,మర్రు రామారావు, తిరుమణి పాపయ్య,శివర్ల పర్వతాలు,దాసరి తిరుపతయ్య,కాయితి బచ్చిరెడ్డి,మాదగోని కృష్ణ గౌడ్,దాసరి ముత్తయ్య,మర్రు సురెందర్ రావు, మర్రు శ్రీనివాసరావు,గంటెల ఆంజనేయులు,పంగ సత్తయ్య,ఉడుత వెంకటయ్య,చల్మయ్య, తదితరులు పాల్గొన్నారు



## తెలంగాణ సచివాలయంలో గిరిజన సంక్షేమ శాఖ మంత్రి వర్యులు అడ్లూరి లక్ష్మణ్ అధ్యక్షతన జరిగిన గిరిజన సలహా మండలి (టి ఏ సి ) సమావేశంలో పాల్గొన్న దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్

దేవరకొండ ఏప్రిల్ 8 (వార్తా వేదిక సూర్య ):-



దేవరకొండ నియోజకవర్గంలోని అటవీ ప్రాంత సమస్యలతో పాటు పర్యాటక రంగ అభివృద్ధిపై పలు అంశాలను చర్చించారు

వైజాగ్ కాలనీ ఎకో-టూరిజం ప్రాజెక్టు నాగార్జునసాగర్ వెనుక జలాల తీరాన ఉన్న వైజాగ్ కాలనీ ఎకో-టూరిజం ప్రాజెక్టు పనులు ప్రస్తుతం నిలిచిపోయాయని, వాటిని తక్షణమే పునఃప్రారంభించాలని కోరారు

ఈ ప్రాజెక్టు పూర్తయితే స్థానిక గిరిజన యువతకు ఉపాధి పెరగడమే కాకుండా, దేవరకొండ పర్యాటక హబ్‌గా మారుతుందని పేర్కొన్నారు.

అటవీ భూముల సమస్యలు దేవరకొండ నియోజకవర్గంలోని అటవీ ప్రాంతాల్లో గిరిజనులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను, ఇతర అటవీ సంబంధిత ఇబ్బందులను కమిటీ దృష్టికి తీసుకెళ్లి, వాటికి శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు

పర్యాటక ప్రాజెక్టుల విస్తరణ దేవరకొండ అటవీ ప్రాంతంలోని సహజ సిద్ధమైన ప్రదేశాలను గుర్తించి, మరిన్ని కొత్త పర్యాటక ప్రాజెక్టులను చేపట్టాలని కోరారు

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే లలు,అటవీ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు

# జలమండలి జనరల్ మేనేజర్‌ని కలిసిన మాజీ కార్పొరేటర్ డా.హేమ సామల

సికింద్రాబాద్, ఏప్రిల్ 08(వార్త వేదిక సూర్య)
మారేడుపల్లి జలమండలి కార్యాలయంలో జలమండలి జనరల్ మేనేజర్ వినోద్ గారికి మాజీ కార్పొరేటర్ డా.హేమ సామల కలిసి డివిజన్ లోని నీటి సరఫరా సమస్యపై లేఖను అందించారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ ఆ ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యలపై సంబంధిత అధికారులను తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.ప్రాంతంలో ఉన్న పవర్ బోర్ సరిగా పనిచేయకపోవడంతో తీవ్రమైన నీటి కొరత ఏర్పడిందని, ముఖ్యంగా వేసవి కాలంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆమె జిఎం గారికి తెలిపారు. నీటి సరఫరా లో అంతరాయం కలగడం వల్ల స్థానికులకు తీవ్ర అసౌకర్యం కలుగుతోంది అని అదేవిధంగా, ముందుగా ఆమోదం పొందిన నీటి సరఫరా మరియు మౌలిక వసతుల పనులు ఇంకా అమలు కాలేదని, ఈ ఆలస్యం కారణంగా ప్రజలు నిరంతరం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆమె పేర్కొన్నారు.ఈ సందర్భంగా అధికారులను కింద పేర్కొన్న విషయాలపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు. పనిచేయని పవర్ బోర్‌ను తక్షణం మరమ్మతులు చేసి పునరుద్ధరించాలి.పెండింగ్‌లో ఉన్న అన్ని ఆమోదిత పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలి అని కోరారు,ప్రజలకు నిరంతర తాగునీటి సరఫరా మరియు ప్రాథమిక సౌకర్యాలు అందేలా తక్షణ చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. ఇప్పటికే పెండింగ్ లో ఉన్న పనులకు 46 లక్షల రూపాయలు నిధులు మంజూరు అయ్యాయని త్వరగా పనులు చేపట్టాలని కోరారు.ఈ సందర్భంగా ప్రజలకు తమ ప్రాంతంలోని బోర్లు ఉండి పనిచేయకపోతే ఆమె దృష్టికి తీసుకురావాలని కోరారు ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్ వినోద్ పాల్గొన్నారు



# విద్యా ప్రమాణాల పరిరక్షణకు సమిష్టి బాధ్యత

- టీఎస్ఎస్ఓ అధ్యక్షుడు ఎం. లక్ష్మి నివాస్

మైలర్ దేవ్ పల్లి, ఏప్రిల్ 08 ( వార్త వేదిక సూర్య ) :
విద్య అనేది ప్రతి విద్యార్థి జీవితాన్ని తీర్చిదిద్దే శక్తివంతమైన సాధనం. ఇది కేవలం వ్యక్తిగత అభివృద్ధికి మాత్రమే కాకుండా, సమాజ పురోగతికి కూడా కీలక పాత్ర పోషిస్తుంది. అయితే ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా కొన్ని ప్రైవేట్ పాఠశాలల్లో కనిపిస్తున్న లోపాలు విద్యా వ్యవస్థపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయని తెలంగాణ సోషల్ స్టూడెంట్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం. లక్ష్మి నివాస్ అన్నారు. ఆయన అభిప్రాయం ప్రకారం, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాల్సిన పాఠశాలలు కనీస సౌకర్యాలు లేకుండా నడుస్తున్నాయి. సరైన ఆటస్థలాలు



లేకపోవడం, అర్హతలేని ఉపాధ్యాయులు బోధించడం, భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వంటి అంశాలు తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. ముఖ్యంగా ఫైర్ సేఫ్టీ లేకపోవడం, ఇరుకైన తరగతి గదులు, గాలి ప్రసరణ లోపం వంటి సమస్యలు విద్యార్థుల ఆరోగ్యానికి ముప్పుగా మారుతున్నాయని తెలిపారు. శుభ్రత, శానిటేషన్, తాగునీటి సౌకర్యాలు సరైన స్థాయిలో లేకపోవడం వల్ల విద్యార్థుల శారీరక మరియు మానసిక అభివృద్ధిపై ప్రతికూల ప్రభావం పడుతున్నదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితులు కొనసాగితే సమాజ భవిష్యత్తుపై కూడా ప్రభావం పడే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్రభుత్వం నిర్దేశించిన జీవో ఎంఎస్ నం. 1 మరియు విద్యా హక్కు చట్టం (ఆర్ టీ ఈ) నిబంధనలను కఠినంగా అమలు చేయాల్సిన అవసరం ఉందని లక్ష్మి నివాస్ పేర్కొన్నారు. సమ్మర్ సెలవుల్లో అన్ని పాఠశాలలపై సమగ్ర తనిఖీలు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘిస్తున్న విద్యాసంస్థలపై తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు.

## అనాథ యువతి వివాహానికి అండగా నిలిచిన కాంగ్రెస్ పార్టీ గన్యానాయక్ తండ గ్రామ నాయకులు నేనావత్ సంతోష్ నాయక్

దేవరకొండ ఏప్రిల్ 8( వార్త వేదిక సూర్య )



సమాజంలో వెనుకబడిన వర్గాలకు ఎల్లప్పుడూ అండగా నిలుస్తూ సేవా కార్యక్రమాల్లో ముందుండే కాంగ్రెస్ నాయకులు నేనావత్ సంతోష్ నాయక్ మరోసారి తన ఉదారతను చాటుకున్నారు. దేవరకొండ మండలం పర్శతండ గ్రామానికి చెందిన కి.శే. నేనావత్ రవి - చిట్టీల కుమార్తె సోని తల్లిదండ్రులు లేక అనాథగా, పేదరికంలో జీవిస్తూ వివాహం జరపడం కష్టసాధ్యంగా మారిన పరిస్థితిని స్థానికులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

ఈ విషయాన్ని తెలుసుకున్న వెంటనే స్పందించిన నేనావత్ సంతోష్ నాయక్ , ఆ యువతి పరిస్థితిని గమనించి మానవత్వంతో ముందుకు వచ్చి, ఆమె వివాహం ఆగిపోకుండా తన వంతు సహాయం అందించాలని నిర్ణయించారు. సోని వివాహానికి □5116/- నగదు సహాయం అందజేసి ఆమె కుటుంబానికి ధైర్యం ఇచ్చారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "సమాజంలో ఎవరూ అనాథలుగా, ఆపన్నులుగా మిగలకూడదు. ముఖ్యంగా ఆడపిల్లల పెళ్లిళ్లు ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఆగిపోవడం చాలా బాధాకరం. అలాంటి సందర్భాల్లో ముందుకు వచ్చి సహాయం చేయడం మనందరి సామాజిక బాధ్యత. నేను ఎప్పటికీ ప్రజలతోనే ఉంటాను, అవసరమైనప్పుడు అండగా నిలుస్తాను" అని తెలిపారు.

గ్రామ ప్రజలు, నాయకులు సంతోష్ నాయక్ చేసిన ఈ సేవా కార్యక్రమాన్ని అభినందిస్తూ, ఇలాంటి సేవా దృక్పథం ఉన్న నాయకులు సమాజానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు.

# అత్యంత వైభవంగా శ్రావణి - భానుచందర్ వివాహ మహోత్సవం

మైలర్ దేవ్ పల్లి, ఏప్రిల్ 08 ( వార్త వేదిక సూర్య ) :
అడికే శ్రావణి మరియు భానుచందర్ ల వివాహ వేడుక బుధవారం నాడు ఇబ్రహీంపట్నంలోని కేఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో కన్నుల పండువగా జరిగింది. అత్యంత వైభవంగా జరిగిన ఈ వేడుకలో హిందూ సంప్రదాయ పద్ధతిలో, వేద మంత్రోచ్ఛారణల మధ్య వధూవరులు మూడు ముళ్ల బంధంతో ఒక్కటయ్యారు. ఈ వివాహ వేడుకకు రాజేంద్రనగర్ నియోజకవర్గం నుంచి సామాజిక సంస్థల ప్రతినిధులు హాజరై య్యారు.

నవ యువ యూత్ క్లబ్ , "మానవ సేవే మాధవ సేవా" సంస్థ ప్రతినిధులు మరియు మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని సేవా భారతి (కిషోరి వికాస్) సభ్యులు ప్రత్యేకంగా విచ్చేసి నూతన వధూవరులను ఆశీర్వదించారు. నూతన వధూవరులకు క్లబ్ తరపున వివాహ కానుకను (గిఫ్ట్) అందజేశారు. వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమానికి హాజరైన బంధుమిత్రులు, సన్నిహితులు నూతన జంటపై అక్షింతలు వేసి, వారు నిండు నూరేళ్ల సుఖసంతోషాలతో వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. వివాహానికి విచ్చేసిన ప్రతి అతిథిని వధూవరుల కుటుంబ సభ్యులు సాదరంగా ఆహ్వానించి, తమ కృతజ్ఞతలు తెలియజేశారు.





# లంబాడీ గిరిజనులకు మంత్రి పదవి ఇవ్వాల్సిందే

### రైట్ టు ఇన్ఫర్మేషన్ సర్వీస్ సొసైటీ మరియు గిరిజన జాయింట్ యాక్షన్ కమిటీ ప్రతినిధి కె. బాబు రామ్ నాయక్ డిమాండ్

దేవరకొండ ఏప్రిల్ 8 ( వార్తా వేదిక సూర్య ):-

తెలంగాణ రాష్ట్రంలో 40 నుంచి 50 లక్షల మంది అపారమైన జనాభా కలిగిన లంబాడీ సామాజిక వర్గానికి రాష్ట్ర మంత్రివర్గంలో పాతినిధ్యం ఇంతవరకు ఇవ్వలేదు రేపు జరిగే మంత్రివర్గంలో లంబాడీలకు తక్షణమే సముచిత స్థానం కల్పించాలని రైట్ టు ఇన్ఫర్మేషన్ సర్వీస్ సొసైటీ మరియు గిరిజన జాయింట్ యాక్షన్ కమిటీ ప్రతినిధి కె. బాబు రామ్ నాయక్ రాష్ట్ర ప్రభుత్వాన్ని మరియు కాంగ్రెస్ అధిష్టానాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 40 నుంచి 45 నియోజకవర్గాల్లో లంబాడీ గిరిజన సోదరులు ఏకపక్షంగా ఓటేసి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గెలిపించారని, ఈ ప్రభుత్వంపై గిరిజనులకు ఉన్న ప్రేమను గౌరవించి ఖచ్చితంగా మంత్రి పదవి ఇవ్వాలని ఆయన స్పష్టం చేశారు. గత జూలై 2025లో ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయం ముందు లంబాడీ నేతలు చేపట్టిన ఆందోళన సందర్భంగా అగ్రనేతలు కేసీ వేణుగోపాల్ మరియు దీపాదాస్ మున్షీలు ఇచ్చిన హామీని ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని, ఢిల్లీ వీధుల్లో మహిళలు మరియు యువకులు తమ ఆత్మగౌరవం కోసం చేసిన పోరాట ఫలితాన్ని గుర్తించాలని కోరారు. రాబోయే క్యాబినెట్ విస్తరణలో ఏమాత్రం ఆలస్యం చేయకుండా లంబాడీ గిరిజన ప్రతినిధికి మంత్రి పదవి కేటాయించాలని, ఒకవేళ ఇచ్చిన హామీని విస్మరిస్తే రైట్ టు ఇన్ఫర్మేషన్ సర్వీస్ సొసైటీ మరియు గిరిజన జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని కె. బాబు రామ్ నాయక్ హెచ్చరించారు

# పెండింగ్లో ఉన్నటువంటి ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్స్8500 కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలి

### బి ఫీజు రియంబర్స్మెంట్ పథకాన్ని ఎత్తివేయాలని ఆలోచనను విరమించుకోవాలి, బిదేవరకొండ ఆర్డిఓ రమణారెడ్డి కి వినతి పత్రం అందజేసినారు

దేవరకొండ ఏప్రిల్ 8 ( వార్త వేదిక సూర్య ):-



సామాజికవేత్త, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డా" చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ డిమాండ్

దేవరకొండ పట్టణంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య పిలుపుమేరకు రాష్ట్రవ్యాప్తంగా జరిగేటటువంటి ఆందోళన కార్యక్రమాలలో భాగంగా బుధవారం రోజున దేవరకొండ ఆర్డిఓ రమణారెడ్డి గారికి కొన్ని సంవత్సరాలుగా పెండింగ్ లో ఉన్నటువంటి ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్షిప్ లను 8500 కోట్లను తక్షణమే విడుదల చేయాలని ఫీజు రియంబర్స్మెంట్ పథకాన్ని ఎత్తివేసే ఆలోచనను విరమించుకోవాలని వినతి పత్రం అందజేయటం జరిగినది. ఈ సందర్భంగా సామాజికవేత్త బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.

గత నాలుగు సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్నటువంటి ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్లు 8500 కోట్లు తక్షణమే విడుదల చేసి బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీ విద్యార్థులకు మేలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

హైకోర్టు విద్యార్థుల నుంచే ఫీజులను వసూలు చేయాలనే విషయం చెప్పడం, పేద విద్యార్థులకు చదువుకు దూరం చేసేటటువంటి పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. కేవలం ప్రభుత్వం తరఫున హైకోర్టులో వాదించేటటువంటి అడ్వకేట్ జనరల్, న్యాయవాదులు సరి అయిన వాదనలు ప్రభుత్వం తరఫున వినిపించక పోవడం వల్లనే ఈ తప్పిదం జరిగినదని. ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఇప్పటికైనా హైకోర్టులో ఇంప్లీడు పిటిషన్ వేసి పేద విద్యార్థులకు న్యాయం జరిగే విధంగా ప్రభుత్వం తరఫు న్యాయవాదులు పేద ప్రజల విద్యార్థుల పక్షాన మాట్లాడి న్యాయం జరిగే విధంగా చేయాలని. ఇప్పటికే సుప్రీంకోర్టులో విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేయవద్దని చాలా తీర్పులు వచ్చాయి. బీసీ ఎస్టీ ఎస్సీ విద్యార్థులు విద్యార్థులు చదువుకు దూరం కావద్దంటే ఫీజు రియంబర్స్మెంట్ పథకాన్ని ఎత్తివేసే ఆలోచనను ప్రభుత్వము విరమించుకోవాలి లేనియెడల పెద్ద ఎత్తున రాస్తా రోకోలు ధర్నాలు అనేక కార్యక్రమాల ద్వారా ప్రభుత్వాన్ని స్తంభింప చేస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలోపున్న వెంకటేష్ నేత, డబ్బే కార్ పెంటోజి గిరి వెంకటయ్య గౌడ్ ఎమ్మార్పీఎస్ నాయకులు సహదేవ్ బుర్రి వెంకన్న బొమ్మగాని శివ గౌడ్, చేరిపల్లి జయలక్ష్మి పున్న భిక్షమయ్య భీమ గోని శివ గౌడ్ బొమ్మ శ్రీనివాస్ యాదవ్ లావుడియా భాష నాయక్ జిల్లా రాములు యాదయ్య చారి లలిత రమణ, తదితరులు పాల్గొన్నారు

# సోయాబీన్ పరిశోధనలపై మూడు రోజుల జాతీయ సమావేశాలు ప్రారంభం





### - రెండో రోజు సమావేశాలకు ముఖ్య అతిథిగా వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్రమోహన్ హాజరు

### - 2047 కల్లా 40 మెట్రిక్ టన్నుల ఉత్పత్తి లక్ష్యం

మైలర్ దేవ్ పల్లి, ఏప్రిల్ 08 ( వార్త వేదిక సూర్య ) :

హైదరాబాద్లో సోయాబీన్ పంటపై 56వ అఖిల భారత సమన్వయ పరిశోధన పథకం వార్షిక సమావేశాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం మరియు ఇండోర్లోని జాతీయ సోయాబీన్ పరిశోధనా సంస్థ సంయుక్తంగా ఈ మూడు రోజుల సమావేశాలను నిర్వహిస్తున్నాయి. సమావేశాల రెండో రోజు రాష్ట్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్రమోహన్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అత్యధిక ప్రాధాన్యతనిస్తోందని తెలిపారు. పంటల మార్పిడిలో భాగంగా ప్రత్యామ్నాయ పంటగా సోయాబీన్ సాగును విస్తరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం సోయాబీన్ ఉత్పాదకతలో అగ్రస్థానంలో ఉన్నప్పటికీ, పంట విస్తీర్ణం పెంపుపై మరింత దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. 2047 కల్లా సోయాబీన్ విస్తీర్ణాన్ని గణనీయంగా పెంచి, ఉత్పత్తిని 40 మెట్రిక్ టన్నులకు చేర్చడమే లక్ష్యంగా పెట్టుకున్నామని వెల్లడించారు. అధిక దిగుబడి ఇచ్చే వంగడాల అభివృద్ధి, వాతావరణ మార్పులకు తట్టుకునే రకాల రూపకల్పన, నీటి ఒత్తిడిని ఎదుర్కొనే సోయాబీన్ రకాలు అభివృద్ధి చేయడం అత్యవసరమని ఆయన సూచించారు. ఈ చర్యల ద్వారా రైతుల ఆదాయం పెరుగుతుందని తెలిపారు. ఈ సమావేశాల్లో వచ్చిన సూచనలను ప్రభుత్వం స్వీకరిస్తుందని స్పష్టం చేశారు.సోయాబీన్ అఖిల భారత సమన్వయ పథకం ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ కె హెచ్ సింగ్ ప్రాజెక్టు పురోగతిని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ప్రపంచంలో సోయాబీన్ విస్తీర్ణం, ఉత్పత్తిలో భారత్ ఐదవ స్థానంలో ఉన్నప్పటికీ, ఉత్పాదకతలో వెనుకబడిన పరిస్థితి ఉందని తెలిపారు. 1999 సంవత్సరాన్ని సోయాబీన్ సాగులో గోల్డెన్ పీరియడ్గా పేర్కొన్నారు. సోయాబీన్ సాగులో స్థిరత్వం లేకపోవడం ఒక ప్రధాన సవాలుగా ఉందని, ఉప ఉత్పత్తులను పశుదానంగా మాత్రమే కాకుండా ప్రోటీన్ ఆహారంగా వినియో గించాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు. సోయాబీన్ పంట భూసారాన్ని పెంచడంలో, ప్రకృతి వైపరీత్యాలను తట్టుకునే గుణాలలో కూడా కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. ఈ సమావేశాల వివరాలను విశ్వవిద్యాలయం పరిశోధనా సంచాలకులు డాక్టర్ బలరాం వెల్లడించారు. కార్యక్రమంలో భారత నూనె గింజల పరిశోధన సంస్థ సంచాలకులు డాక్టర్ ఆర్కే మాథూర్, మాజీ ఉపకులపతి ఎస్కే రావు తదితరులు పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుండి వచ్చిన శాస్త్రవేత్తలు ఈ సమావేశాలలో పాల్గొంటున్నారు

# కల్తీ ఆహార కేంద్రాలపై.. పోలీసుల పంజా





### మైలార్దేవ్పల్లి పరిధిలో మెరుపు దాడులు రూ. 2 లక్షల విలువైన పదార్థాలు సీజ్

మైలర్ దేవ్ పల్లి, ఏప్రిల్ 08 ( వార్త వేదిక సూర్య ) :

ప్రజల ఆరోగ్యంతో ఆటలాడుతున్న కల్తీ ఆహార మాఫియాపై మైలార్దేవ్పల్లి పోలీసుల గట్టి దెబ్బ పడింది. బుధవారం నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్లో నాసిరకం, కల్తీ ఆహార పదార్థాలను తయారు చేస్తున్న పలు యూనిట్లపై అకస్మిక దాడులు నిర్వహించి సుమారు రూ.2 లక్షల విలువైన పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు.స్వీట్లు, బేకరీ ఉత్పత్తులు, కుర్కురే తరహా స్నాక్స్, మిల్మేకర్, మిశ్రమ పదార్థాల పేరుతో ప్రజలకు విషం అందిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. అనారోగ్యానికి దారితీసే నాణ్యతలేని పదార్థాలను నిర్లక్ష్యంగా తయారు చేస్తున్న యజమానుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. కట్టేదాన్లోని మారుతి ఫుడ్స్లో కుర్కురే పోలో రింగ్స్ పేరిట నాసిరకం పదార్థాలు తయారు చేస్తుండగా 10 లూజ్ ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. ఇండియన్ బేకరీ అండ్ స్వీట్స్ హౌస్లో బిస్కెట్లు, ఇతర బేకరీ వస్తువులు కల్తీగా ఉన్నట్లు గుర్తించారు. అలాగే లక్ష్మిగూడలోని కృష్ణ ఫుడ్ ప్రోడక్ట్స్, బిఎస్ ఫుడ్ ప్రోడక్ట్స్ యూనిట్లలో మిశ్రమం, మిల్మేకర్, నల్లీ పాపడ్ వంటి పదార్థాలు భారీగా పట్టుబడ్డాయి.

ప్రజల ఆరోగ్యాన్ని పట్టించుకోకుండా లాభాల కోసం ఇలాంటి అక్రమాలకు పాల్పడుతున్న యజమానులపై పోలీసులు కేసులు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇంకా ఇలాంటి దాడులు కొనసాగుతాయని అధికారులు స్పష్టం చేశారు.







# అక్రిడిటేషన్లపై ఆందోళన వద్దు

### అర్హులైన జర్నలిస్టులందరికిఅక్రిడిటేషన్లు

### అక్రిడిటేషన్ దరఖాస్తుల ప్రక్రియ నిరంతరం

### సమాచార పౌరసంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ సిహెచ్. ప్రియాంక

హైదరాబాద్( వార్తా వేదిక సూర్య )

జర్నలిస్టుల అక్రిడిటేషన్ దరఖాస్తుల ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని సమాచార పౌరసంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ సిహెచ్. ప్రియాంక ఒక ప్రకటనలో తెలిపారు.

దరఖాస్తుల ప్రక్రియపై ఇటీవల మీడియాలో వస్తున్న వార్తలపై జర్నలిస్టులు ఎటువంటి ఆందోళన చెందవద్దని అర్హులైన జర్నలిస్టులందరికీ కార్డులు ఇస్తామని కమిషనర్ పేర్కొన్నారు.

రాష్ట్ర స్థాయిలో ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తులను ఈ నెల 10వ తేదీన జరిగే రాష్ట్ర స్థాయి అక్రిడిటేషన్ కమిటీ సమావేశంలో స్క్రూట్నీ చేసి అర్హులైన జర్నలిస్టులకు కొత్త అక్రిడిటేషన్ కార్డులను మంజూరి చేస్తూ నూతన కార్డులు జారీ చేయడం జరుగుతుందని, అర్హులైన జర్నలిస్టు ఆన్లైన్ లో తమ దరఖాస్తులను అప్లోడ్ చేసుకోవాలని, ఏప్రిల్ మాసంలో అక్రెడేషన్ జారీ ప్రక్రియ పూర్తి చేయడం జరుగుతుందని, కమిషనర్ సిహెచ్. ప్రియాంక తెలిపారు.

అదేవిధం జిల్లా స్థాయిలో కూడా ఈనెలలోనే జిల్లా కమిటీలు సమావేశాలు ఏర్పాటు చేసి అర్హులైన జర్నలిస్టులకు అక్రెడిటేషన్ లు జారీ చేయడం జరుగుతుందని, జిల్లాలో జిల్లా స్థాయి దరఖాస్తు చేసుకొనే అర్హులైన జర్నలిస్టులు వెంటనే తమ దరఖాస్తులను ఆన్లైన్లో చేసుకోవాలని ఆమె కోరారు.

# మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డి కీలక వ్యాఖ్య, నల్లగొండ మాన్యం చెల్కపిహెచ్ సికి ప్రతీక్ ఫౌండేషన్ రూ. 50 లక్షలు వెచ్చించింది





నల్గొండ టౌన్ ఏప్రిల్ 8 /వార్తా వేదిక సూర్య/

నల్లగొండ: ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా పేదలకు మెరుగైన వై ద్యం అందించడమే లక్ష్యమని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సి ని మాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపా రు. ప్రజా పాల న- ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ నెల 6 నుండి 11వరకు నిర్వహి స్తున్న ఆరోగ్య వారోత్సవాల సం దర్భంగా బుధవారం అయన నల్గొండ జిల్లా కేంద్రంలోని మాన్యం చె ల్కలో కోటి 91 లక్ష రూపాయల వ్యయంతో నిర్మించిన పట్ట ణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నల్గొండ ప్రభుత్వ ప్ర ధాన ఆ స్పత్రిలో రోగుల సంఖ్య విపరీతంగా పెరిగిపోవడా న్ని దృష్టిలో ఉం చుకొని మాన్యంచెల్క పట్టణ ప్రాథమిక ఆ రోగ్య కేంద్రం ద్వారా మె రుగైన వైద్యం అందించేందుకు ప్ర భుత్వ నిధులతో పాటు, ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా 50 లక్షల రూపా యల వ్యయంతో అవసరమైన మౌలిక సదుపాయా లు, డాక్టర్లను ఏ ర్పాటు చేసినట్లు తెలిపారు. మాన్యంచెల్క యుపిహెచ్ సికి నూతన భవనాన్ని నిర్మించడమే కాకుండా, అవసరమైన మెడికల్ సామాగ్రిని ఏర్పాటు చేయడం జరిగిం దని, ఇంకాఅవసరమైతే ఎక్కువ ఎక్విప్మెంట్ సమకూరుస్తా మన్నారు.

చుట్టుపక్కల ప్రజలు,పెద్దవారు గ ర్భిణీ స్త్రీలకు, మాన్యంచె ల్క పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అనువుగా ఉంటుందని ఇక్కడే అన్ని రకా ల వైద్య సేవలు అందించేందుకు ఏ ర్పా టు చేస్తామని, పరీక్షలతో పా టు, అవసరమైతే ప్రభుత్వ ప్ర ధాన ఆస్పత్రికి రిఫర్ చేసే విధంగా వైద్య సేవలు అందించా లని డాక్టర్లకు సూచించారు. కార్పొరేటర్లు వివిధ రకాల జ బ్బులతో బాధపడే ప్రజలను గుర్తించి పట్టణ ప్రాథమిక ఆరో గ్య కేంద్రానికి పంపించాలని చెప్పా రు.నల్గొండ కార్పొరేషన్ అయినం దున సిసి రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, మంచి వైద్య సదుపాయాలు అందించడం జరుగుతుందని తెలిపారు.

ప్రతీక్ ఫౌండేషన్, ఎల్వీ ప్రసాద్ సంయుక్త ఆధ్వర్యంలో మూ డెకరాల స్థలంలో కంటి ఆసుపత్రిని నిర్మించేందుకు కృషి చే స్తున్నట్లు తెలిపారు.అనుకోకుండా పట్టణ పిహెచ్ సిలో మం దులు అందుబాటులో లేకుంటే ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా ఒక ప్రయివేట్ మెడికల్ షాపును గుర్తించి అవసరమైన అత్యవ సర మందులు అందజేసే విధంగా అనుసంధానం చేయడం జరిగిందని, డాక్టర్ల ప్రిస్క్రిప్షన్ ఆధారంగా మందులు ఇవ్వ డం జరుగుతుందని, ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసు కోవాలని మంత్రి కోరారు.

అవసరమైతే మాన్యం చెల్కపట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం లో అక్షయ ఫౌండేషన్ సహకారంతో ఆసుపత్రికి వచ్చిన రో గులకు ఆహారం ఇ చ్చేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి వెల్లడించారు.పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని డాక్టర్లు, ఆశ వర్కర్లు బాగా పనిచేయాలని, పేద ప్రజలకు మంచి వైద్యం అందించాలని మంత్రి ఆదేశించారు. మాన్యం చెల్క చౌరస్తా సుందరీకర ణతో పాటు, విస్తరించి తీర్చిదిద్ద డం జరుగుతున్నదని తెలిపారు.

నల్గొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ మాన్యం చెల్కతో పాటు, చుట్టుపక్కల వార్డుల ప్రజలకు ప ట్టణ ప్రాథమిక వై ద్య ఆరోగ్య కేంద్రం ఎంతగానో ఉపయోగ పడుతుందని అన్నారు. ప్రతీ క్ ఫౌండేషన్ ద్వారా సొంతం గా 50 లక్షల రూపాయలను పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రా నికి ఇవ్వడం పట్ల ఆమె మంత్రిని అభినందించారు.అన్ని సౌ కర్యాలతో ఏర్పాటు చే సిన మాన్యం చెల్కపట్టణ ప్రాథమి క ఆరోగ్య కేంద్రంలో కొన్ని రకాల ప రీక్షలను సైతం ఇక్కడే చే సుకోవచ్చని, డాక్టర్లు పేద ప్రజల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకొని వైద్యం అందించాల ని కోరారు.ఎమ్మెల్సీ శంకర్ నాయక్ మా ట్లాడుతూ విద్యతోపాటు, పేదప్రజలకు వైద్యంఅందించేం దు కు మంత్రి చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు.

జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ మాన్యంచెల్క పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా పేద ప్రజలకు నాణ్య మైన వైద్యం అం దించేందుకు ఎంతగానో ఉపయోగ పడు తుందని, ఆస్పత్రికి అవసర మైతే అదనపు సౌకర్యాలు, మె డికల్ ఎక్విప్మెంట్ కు సహకారం అం దించాలని మంత్రికి వి జ్ఞప్తి చేశారు. చుట్టుపక్కల ప్రజలు మెరుగైన వై ద్యాన్ని ఈ ఆస్పత్రి ద్వారా పొం ద వచ్చని, ఆసుపత్రి డాక్టర్లు, సిబ్బం ది ఆవిధంగా పని చేయాలన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్య క్రమంలో భాగంగా ఈనెల 6 నుండి 11 వరకు నిర్వ హిస్తున్న ఆరోగ్య ఉ త్సవాల్లో మాన్యంచెల్క పట్టణ ప్రా థ మిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభిం చడం జరిగిందని, ఇక్కడ వివిధ ర కాల టెస్టులలను చేయడం జరుగుతుందని, ప్రభు త్వం ఉచితంగా అం దిస్తున్న హెచ్పీవీ వ్యాక్సిన్ ను అం ద రు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు. జి ల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ మాట్లా డారు.

డిప్యూటీ మే యర్ అమీర్ అలీ,ప్రధాన ఆస్పత్రి సూప రిం టిండెం ట్ నరసింహారావు నేత, డిప్యూటీ డిఎంహెచ్ ఓ వే ణు గోపాల్ రెడ్డి, జిల్లా టీబి నియంత్రణ అధికారి డాక్టర్ క ళ్యాణ్ చక్రవర్తి, యుపిహెచ్ సి డాక్టర్లు, సిబ్బంది, ప్రజా ప్ర తినిధులు, అధికారులు ఉన్నారు.



## తొమ్మిది మంది పోలీసులకు మరణశిక్ష

### మదురై సెషన్స్ కోర్టు సంచలన తీర్పు

మదురై : 9 మంది పోలీసులకు మరణ శిక్ష విధిస్తు తమిళనాడులోని మదురై సెషన్స్ కోర్ట్ సంచలన తీర్పు చెప్పింది .వివరాల్లోకి వెళ్ళితే 2020 లాక్ డౌన్ లో మొబైల్ షాప్ తెరిచి ఉ ంచారని తండ్రి కొడుకులను అరెస్ట్ చేసిన పోలీసులు పోలీస్ స్టేషన్లో చిత్రహింసలు పెట్టడంతో వారు పోలిసుల చిత్ర హింసలు తట్టుకోలేక మరణించారు . ఇది అప్పట్లో పెద్ద కెహెర్చనీయాంశం అయింది .పోలీసుల చర్యలను పౌరసమాజం ,రాజకీయపార్టీలు , ప్రజాసంఘాలు ,పౌరహక్కుల సంఘాలు తీవ్రంగా ఖండించాయి ..తండ్రి కొడుకుల మరణానికి 9 మంది పోలీసులు కారణమని కోర్ట్ నిర్ధారించింది .దీంతో ఆ తొమ్మిది మంది పోలీసులకు మరణశిక్ష వేసిన మదురై సెషన్స్ కోర్టు తీర్పు..ఇది దేశంలోనే సంచలన తీర్పుగా మారింది .పోలీసులకు మరణ శిక్ష విధించడం పై కేసు పూర్వాపరాలు తెలుసుకొనేందుకు నోటీజన్లు ప్రయత్నాలు ప్రారంభించారు ..

# హామీల అమలుకు టైం పడుతుందన్న సీఎం రేవంత్ రెడ్డి ...

ఆదిలాబాద్, (వార్తా వేదిక సూర్య )

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి హామీల అమలు పై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలకు దీటుగా సమాధానం ఇచ్చే ప్రయత్నం చేశారు ..కాకపోతే ఆయన ఎన్నికలు అయినా వెంటనే వాగ్దానాలు అమలు చేస్తామని ప్రకటించారు ..దీంతో ప్రతిపక్ష పార్టీలు వాటినే గుర్తు చేస్తున్నాయి.. దీంతో సోమవారం ఆదిలాబాద్ జిల్లా పిప్పిరి లో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ తాము చేసిన ప్రతి వాగ్దానానికి కట్టుబడి ఉన్నామని అంటూ కండరాలు తిరిగిన ఆరు అడుగులున్నోడైనా పెళ్లి చేసిన 3 నెలలకే పిల్లలను పుట్టించగలడా?!! అంటూ తనదైన శైలిలో స్పందించారు ..దేనికైనా ఒక పద్ధతి ఉ ంటది... మేము హామీలు అమలు చేయాలన్నా టైమ్ పడుతుందని కుండబద్దలు కొట్టారు ..

**త్వరలోనే ఆదిలాబాద్‌కు విమానాశ్రయం: రేవంత్ రెడ్డి**

ఎన్నికలకు ముందు పీపుల్స్ మార్చ్ పేరుతో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చేపట్టిన పాదయాత్ర పిప్రి నుంచే మొదలయిందని... ఇక్కడి ప్రజలు ఇచ్చిన ధైర్యంతోనే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. పాదయాత్రకు మూడేళ్లు పూర్తయిన సందర్భంగా పిప్రిలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధిపై ఆయన వరాల జల్లు కురిపించారు.

గత ప్రభుత్వంలో ప్రతిపక్షాలను నిర్బంధించే సంస్కృతి ఉండేదని, కానీ తమ 'ప్రజాపాలన'లో ప్రతిపక్ష ఎమ్మెల్యేలకు కూడా వేదికలపై మాట్లాడే అవకాశం కల్పిస్తున్నామని సీఎం తెలిపారు. పార్టీలకు అతీతంగా, తమ ఎమ్మెల్యేలు లేని నియోజకవర్గాల్లో కూడా నిధులు కేటాయిస్తూ అభివృద్ధి చేస్తున్నామని స్పష్టం చేశారు.

త్వరలోనే ఆదిలాబాద్‌కు విమానాశ్రయం రాబోతోందని, వీలైతే జూన్ 2వ తేదీన దీనికి శిలాఫలకం వేస్తామని ప్రకటించారు. వేలాది ఎకరాల్లో దేశంలోనే అతిపెద్ద పారిశ్రామికవాడను ఇక్కడ ఏర్పాటు చేయబోతున్నామని, దీని ద్వారా స్థానిక యువతకు భారీగా ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని చెప్పారు.

తమ్మిడిహెట్టి నుంచి ప్రాణహిత ప్రాజెక్టును తిరిగి ప్రారంభిస్తామని, ఇందుకు సంబంధించి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో సర్వేలు జరుగుతున్నాయని తెలిపారు. జిల్లాలో త్వరలోనే యూనివర్సిటీని నిర్మిస్తామని, అలాగే బాసర క్షేత్రాన్ని దేశంలోనే గొప్పగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు.

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కోసం ఇప్పటివరకు రూ. 10 వేల కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు పథకం వేగంగా కొనసాగుతోందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం 2027 మార్చి వరకు జిల్లాల సరిహద్దు మార్పులకు అవకాశం లేదని, ఆ తర్వాత జ్యుడీషియల్ కమిషన్ వేసి బోథ్ రెవెన్యూ డివిజన్ వంటి డిమాండ్లను పరిష్కరిస్తామని చెప్పారు.

బాసర ఆలయ అభివృద్ధి పనులకు సీఎం రేవంత్ రెడ్డి శ్రీకారం

బాసర సరస్వతి ఆలయంలో సీఎం రేవంత్ రెడ్డి మనవడికి అక్షరాభ్యాసం!

దక్షిణ భారతదేశంలోనే ఉన్న ఏకైక సరస్వతి అమ్మ వారి పుణ్యక్షేత్రం బాసర ఆలయ అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సోమవారం శ్రీకారం చుట్టారు. ఈ మేరకు రూ"225 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఆయన శంకు స్థాపన చేశారు. ప్రస్తుతం 20,వేల చదరపు అడు గుల విస్తీర్ణంలో ఉన్న బా సర ఆలయాన్ని సుమారు 60 వేల చదరపు అడుగు ల మేర విస్తరించనున్నా రు.

కొత్త ఆలయ శిఖరాలు మండపాలు మాఢ వీధులు ఇతర అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేశారు. పార తో మట్టి తవ్వి సీఎం చేతుల మీదుగా పనులు ప్రారంభించారు. వచ్చే ఏడాది పుష్కరాల నాటికి అభివృద్ధి పనులు పూర్తి కావాలని ఈ సందర్భంగా ఆయన అధికారులను ఆదేశించారు.

ఈ నేపథ్యంలోనే ఆయన కుటుంబంతో కలిసి బాసర లోని శ్రీజ్ఞాన సరస్వతీ దేవి అమ్మవారిని దర్శించుకు న్నారు.

# అధిక శబ్దం కలిగించే 72 ద్విచక్ర వాహనాల మాడిఫైడ్ సైలెన్సర్స్ ధ్వంసం





**సైలెన్సర్లు మార్పడి చేసి ప్రజలకు ఇబ్బంది కలిగే విధంగా వినియోగిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరిక**

**జిల్లా ప్రజలు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పోలీసుల సూచన**

నల్లగొండ బ్యూరో, ఏప్రిల్ 8 (వార్తా వేదిక సూర్య )

బుధవారం నల్లగొండ పట్టణంలో జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ట్రాఫిక్ నిబంధనల అమలు, శబ్ద కాలుష్య, వాయు కాలుష్యం నియంత్రణలో భాగంగా పర్యావరణ రక్షణ కొరకు ప్రత్యేక చర్యలు చేపట్టడం జరిగింది. జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ ఆదేశాల మేరకు గత కొన్ని రోజులుగా జిల్లా వ్యాప్తంగా పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తూ, ద్విచక్ర వాహనదారులు మాడిఫైడ్ సైలెన్సర్లు ఉ పయోగించి అధిక శబ్దాలతో సౌండ్ పొల్యూషన్ సృష్టిస్తూ సామాన్య ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న నేపథ్యంలో చర్యలు తీసుకున్నారు.ఈ క్రమంలో సుమారు 72 ద్విచక్ర వాహనాల మాడిఫైడ్ సైలెన్సర్లను గుర్తించి వాటిని తొలగించి, నల్లగొండ పట్టణంలోని క్లాక్ టవర్ కూడలి వద్ద అడిషనల్ ఎస్పి రమేష్ ఆధ్వర్యంలో రోడ్ రోలర్ ద్వారా ధ్వంసం చేయడం జరిగింది.ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పి మాట్లాడుతూ, ద్విచక్ర వాహనదారులు కంపెనీ ద్వారా అందించిన ఒరిజినల్ సైలెన్సర్లను మాత్రమే వినియోగించాలని సూచించారు. సైలెన్సర్లలో అనుమతి లేకుండా మార్పులు చేసి అధిక శబ్దం కలిగించే విధంగా ఉపయోగిస్తే సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు.

అలాగే తిరిగి మాడిఫైడ్ సైలెన్సర్లు వినియోగించినట్లయితే, ఆ వాహనదారుల డ్రైవింగ్ లైసెన్సును రద్దు చేసి, వాహనాన్ని సీజ్ చేయడం జరుగుతుందని తెలిపారు.ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అధిక శబ్దం కలిగించే సైలెన్సర్లను వినియోగించే వారిపై జిల్లా పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటూ, ఇలాంటి ప్రత్యేక డ్రైవ్‌ను కొనసాగిస్తారని తెలిపారు. జిల్లా ప్రజల సురక్షిత ప్రయాణం ప్రమాదాల నివారణ కోసం ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ పోలీ సులకు సహకరించాలని కోరారు. అలాగే ఎవరైనా అధిక శబ్దం కలిగించే మాడి ఫైడ్ సైలెన్సర్లు వినియోగిస్తున్నట్లు గమనించినట్లయితే, సమీప పోలీసు అధికా రులకు సమాచారం అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో నల్లగొండ డీఎస్పీ శివరాం రెడ్డి, 2 టౌన్ సీఐ రాఘవ రావు,ట్రాఫిక్ సిఐ మహాలక్ష్మయ్య,1 టౌన్ సిఐ రాజశేఖర్ రెడ్డి, 2 టౌన్ ఎస్. ఐ సైదులు,రూరల్ ఎస్.ఐ సైదా బాబు, కనగల్ ఎస్. ఐ రాజీవ్ రెడ్డి,మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రముఖ నటి సుభాషిని ఆత్మహత్య?



చెన్నై : తమిళ బుల్లితెరపై తనదైన నటనతో గుర్తింపు తెచ్చుకున్న నటి సుభాషిణి (36) బలవన్మరణానికి పాల్పడటం సినీ వర్గాల్లో తీవ్ర దిగ్భ్రాంతిని నింపింది. చెన్నైలోని పోరూరులో ఉన్న ఒక ప్రైవేట్ అపార్ట్‌మెంట్‌లో ఆమె ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. శ్రీలంకకు చెందిన సుభాషిణి, బెంగళూరుకు చెందిన పిప్పిన్‌ను వివాహం చేసుకున్నారు. వృత్తిరీత్యా షూటింగ్‌ల కోసం ఆమె చెన్నైలో ఒంటరిగా నివసిస్తుండగా, భర్త బెంగళూరులో ఉంటున్నారు.

పోలీసుల ప్రాథమిక విచారణ ప్రకారం, ఆదివారం రాత్రి సుభాషిణి తన భర్త పిప్పిన్‌తో వీడి యో కాల్‌లో మాట్లాడారు. ఆ సమయంలో ఇద్దరి మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం జరిగినట్లు తెలుస్తోంది. ఈ గొడవతో తీవ్ర మనస్తాపానికి గురైన ఆమె, వీడియో కాల్ ముగిసిన వెంటనే ఈ దారుణ నిర్ణయం తీసుకుని ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.


భర్తతో ఉన్న కుటుంబ కలహాలే ఆమె ఆత్మహత్య కు ప్రధాన కారణమని ఆమె స్నేహితులు కూడా పోలీసులకు తెలిపారు. సుభాషిణి కేవలం నటిగానే కాకుండా సోషల్ మీడియాలో కూడా ఎంతో చురుకుగా ఉండేవారు. తమిళంలో సూపర్ హిట్ అయిన 'కయల్' సీరియల్ ద్వారా ఆమె మంచి గుర్తింపు పొందారు ..

# తెలంగాణ అభివృద్ధిపై చర్చకు తాను సిద్ధమని కేరళ సీఎం పినరయి విజయన్‌కి సీఎం రేవంత్ సవాల్

హైదరాబాద్( వార్తా వేదిక సూర్య )

తెలంగాణ ప్రభుత్వంపై కేరళ సీఎం పినరయి విజయన్ విమర్శలపై సీఎం రేవంత్ రెడ్డి సోమవారం హైదరాబాద్‌లో స్పందించారు. తెలంగాణ అభివృద్ధిపై మీతో చర్చకు తాను సిద్ధమని కేరళ సీఎం పినరయి విజయన్‌కి సీఎం రేవంత్ సవాల్ చేశారు..

ఏప్రిల్ 7వ తేదీన కేరళ రాజధాని తిరువనంతపురంలో ముఖాముఖి చర్చకు సిద్ధమన్నారు. తెలంగాణలోని పాత డేటాతో విజయన్ విమర్శలు చేశారని వివరించారు. 2023 డిసెంబర్ నాటికే ఆ పాత డేటా శకం ముగిసిందన్నారు రేవంత్. తెలంగాణ వృద్ధి రేటు టాప్‌లో ఉందని వివరించారు. 2024-25లో తెలంగాణ జీఎస్‌డీపీ (+ూణ్రూ) 10.1 శాతం వృద్ధి సాధించిందని తెలిపారు. పెద్ద రాష్ట్రాల్లో తెలంగాణ నంబర్ వన్ స్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో రైతు సంక్షేమమే ధ్యేయంగా రూ.2 లక్షల వరకు రుణ మాఫీ చేశామని చెప్పారు. అలాగే 25.36 లక్షల



మంది రైతులకు లబ్ధి చేకూర్చామని తెలంగాణ సీఎం సోదాహరణగా వివరించారు. గడచిన 28 నెలల్లో 67,763 ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు పూర్తి చేశామని గణాంకాలతో సహా వివరించారు.

కేరళలో బ్రెయిన్ డ్రెన్ పెరిగిపోయిందంటూ సీఎం రేవంత్ ఈ సందర్భంగా ఆందోళన వ్యక్తం చేశారు. అదే విధంగా ఆ రాష్ట్రంలోని పారిశ్రామిక వృద్ధి సైతం కుంటుపడిందని తెలిపారు. ప్రముఖ నటుడు మోహన్ లాల్ ఫేమస్ డైలాగ్ "నీ పో, మోనే విజయన్ అంటూ సీఎం రేవంత్ రెడ్డి వ్యంగ్యంగా అన్నారు. కేరళ అసెంబ్లీ ఎన్నికలు మరికొద్ది రోజుల్లో జరగనున్నాయి.

ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ తరఫున కేరళలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేరళలోని పినరయి విజయన్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. దాంతో తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు కేరళ సీఎం సంధించారు. దీంతో కేరళ సీఎం వ్యాఖ్యలకు కౌంటర్‌గా సీఎం రేవంత్ స్పందించారు.

## ఏపీలోని 5 గ్రామాలను తెలంగాణలో కలపండి... అమిత్ షాకు మంత్రి తుమ్మల లేఖ

హైదరాబాద్( వార్తా వేదిక సూర్య )

భద్రాచలం సమీపంలోని ఐదు గ్రామాలను తెలంగాణలో విలీనం చేయాలని కోరుతూ రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు లేఖ రాశారు. పాలనా సౌలభ్యం, స్థానిక గిరిజనుల సమస్యల పరిష్కారం కోసం ఈ విలీనం అత్యవసరమని ఆయన తన లేఖలో పేర్కొన్నారు.పురోషోత్తపట్నం , గుండాల, పిచుకలపాడు ఎటపాక కన్నాయిగుడెం గ్రామాలు తెలంగాణ నుంచి ఏపి ల కలవగా భద్రాచలంలోని శ్రీసీతారామ చంద్రస్వామి దేవస్థానం భూముల మాత్రం ఆ గ్రామాల్లోకి వెళ్లి పోయాయి ..దీనితో లీగల్ చిక్కులు ఏర్పడుతున్నాయి .

ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్-తెలంగాణ సరిహద్దుల్లో ఉన్న ఈ ఐదు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మంత్రి తుమ్మల వివరించారు. ఈ గ్రామాలను భద్రాచలంలో విలీనం చేయడం ద్వారా గిరిజనుల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు. ఈ అంశంపై ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే విలీనానికి సంబంధించిన బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించేలా చర్యలు తీసుకోవాలని ఆయన అమిత్ షాను కోరారు.

స్థానిక సమస్యల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం చొరవ చూపి, సానుకూలంగా స్పందించాలని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

# సంగారెడ్డిలో విద్యుత్ ఉద్యోగుల నిరవధిక సమ్మె



సంగారెడ్డి, ఏప్రిల్ 8, (వార్త వేదిక సూర్య ) : టీవీఏఈ జేఏసీ ఆధ్వర్యంలో సుమారు 12,000 మంది ఆర్టిసన్లు పాల్గొన్న "చలో వరంగల్" కార్యక్రమం విజయవంతంగా నిర్వహించినప్పటికీ, మా సమస్యల పరిష్కారం విషయంలో శాఖ నుంచి ఎటువంటి సానుకూల స్పందన లభించలేదని అన్నారు. ఈ నేపథ్యంలో అన్ని ఆర్టిసన్లు, అన్‌మ్యాన్డ్ మరియు పీస్‌రేట్ ఉద్యోగులు కలిసి బుధవారం నుండి సమ్మెను కొనసాగించాలని నిర్ణయించుకున్నామని అన్నారు. బుధవారం సమ్మె శాంతియుతంగా మరియు చట్టబద్ధంగా విజయవంతంగా పూర్తైంది. మా న్యాయమైన అన్ని డిమాండ్లు నెరవేరే వరకు ఈ సమ్మె కొనసాగుతుందని విద్యుత్ ఉద్యోగులు తెలిపారు.

# విద్యార్థులకు ఫీజు బకాయిలు చెల్లించాలని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ కార్యాలయం ముట్టడి జయప్రదం చేయండి

**- ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి పుట్టల ఉదయ్ కుమార్**



రామన్నపేట,, ఏప్రిల్ 08( వార్తా వేదిక సూర్య ): పేద మధ్యతరగతి విద్యార్థుల సంక్షేమమే తమ ప్రభుత్వ దయమని గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులకు ఫీజు బకాయిలు విడుదల చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని, ఫీజులు చెల్లించాలని 9న జరిగే ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాల ముట్టడి జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి పుట్టల ఉదయ్ కుమార్. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారుగా 14 లక్షల మంది ఎస్సీ, ఎస్టీ బీసీ మైనార్టీ విద్యార్థులు స్కాలర్షిప్,ఫీజు రీయింబర్స్మెంట్ రాక అనేక ఇబ్బందులు పడుతున్నారని మునిగే నక్కపై తాటికాయ అన్న చందంగా హైకోర్టు ప్రైవేటు యాజమాన్యాలకు తివాచీపరిచే విధంగా విద్యార్థుల నుండి నిర్బంధంగా వసూలు చేసుకోవచ్చని తీర్పు ఇవ్వడం పెద విద్యార్థులపై పెను భారంగా మారిందని. ఈ సాకుతో విద్యార్థుల నుండి అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థును యాజమాన్యాలు వేధింపులకు గురి చేస్తున్నాయని అన్నారు. ప్రైవేటు కళాశాలలో ప్రభుత్వం ప్రకటించిన ఫీజు పథకం అమలు చేస్తామని అంగీకారాన్ని తెలిపి విద్యార్థులను చేర్చుకున్నారని ఇప్పుడు విజయవాడలో స్వచ్ఛందంగా కట్టాలని నిబంధన తీసుకురావడం సరికాదని అన్నారు. ఈ తీర్పు వల్ల పేద విద్యార్థుల విద్యకు దూరమయ్యే అవకాశం నెలకొన్నదని సర్టిఫికెట్లు ఇవ్వకుండా కళాశాల యాజమాన్యాలు ఇబ్బందులకు గురి చేస్తున్నాయని దీని మూలంగా విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని దీనికి ప్రభుత్వం బాధ్యత వహించాలని అన్నారు. ప్రజల చేత ఎన్నుకోబడిన ఎమ్మెల్యేలు కనీసం ప్రభుత్వాన్ని విద్యార్థుల పక్షాన మాట్లాడి గొంతు విప్పే పరిస్థితి లేదని ప్రభుత్వంలో చలనం తీసుకువచ్చేందుకు శాసనసభ్యుల క్యాంపు కార్యాలయాల ముందు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించడం జరుగుతుందని ఈ ధర్నాకు విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయగలరని కోరారు.

# మాజీ ఉపసర్పంచ్ మృతదేహానికి నివాళు లర్పించిన మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



రామన్నపేట, ఏప్రిల్ 08 (వార్తా వేదిక సూర్య ): రామన్నపేట మండలం సిరిపురం గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ దాసరి శ్రవణ్ కుమార్ రెడ్డి బుధవారం నాడు అనారోగ్యంతో మృతిచెంద గా విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య మృతుని ఇంటి వద్దకు వెళ్లి మృతదేవానికి పూలమాలలు వేసి నివాళు లర్పించడం జరిగింది. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి శ్రవణ్ కుమార్ రెడ్డి కుటుంబాన్ని ఆదుకుంటామని భరోసా కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోషబోయిన మల్లేశం, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బందెల రాములు,సర్పంచులు అంబటి ఉపేంద్రమ్మ రవీందర్ రెడ్డి, గర్దాస్ విక్రమ్, పులిపలు పుల వీరస్వామి,మాజీ ఎంపీటీసీలు పున్న వెంకటేశం, ఎండి ఆమీర్, జిల్లా నాయకులు బద్దుల రమేష్, ఎస్.కె చాంద్, నాయకులు బత్తుల వెంకన్న, కోనూరు ముత్తయ్య, గ్రామ శాఖ అధ్యక్షుడు బండ శ్రీనివాసరెడ్డి, తాళ్ల క్రాంతి కుమార్, చొప్పరి నరసింహ, బొడ్డుపల్లి రాజు, జాల అమరేందర్ రెడ్డి, ఆవుల శ్రీధర్, నల్ల సైదులు, ఎండి ఆరిఫ్, లక్ష్మయ్య, కృష్ణ, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాభివృద్ధికి స్వచ్ఛంద సంస్థల సహకారం అవసరం

**- సర్పంచ్ మంత్రి లత స్వామి**



మోటకొండూర్, ఏప్రిల్ 08 (వార్తా వేదిక సూర్య ): గ్రామాల అభివృద్ధికి స్వచ్ఛంద సంస్థల సహకారం అవసరమని తేర్యాల సర్పంచ్ మంత్రి లతా స్వామి అన్నారు. వారు బుదవారం తేర్యాల లో స్ట్రీట్ కాస్ స్వచ్ఛంద సంస్థ మేనేజర్ సాత్విక, కో ఆర్డినేటర్ బూరెడ్డి రంజిత్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామపంచాయతీలో కంప్యూటర్,సిపియు, ప్రింటర్,అంగన్వాడి కేంద్రంలో పిల్లలకి ఆట వస్తువులు, మహిళా సంఘాలకు కుర్చీలు పంపిణీ చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థల సహకారంతో గ్రామాన్ని ఇంకా ముందుకు తీసుకు వెళ్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో స్ట్రీట్ క్రాస్ స్వచ్ఛంద సంస్థ బృందం సభ్యులు, పంచాయతీ కార్యదర్శి ఉమేష్,ఉప సర్పంచ్ బాజ మోహన్, వార్డు కొలనుపాక రమ్య దుర్గయ్య,ఫీల్డ్ అసిస్టెంట్ ఉస్మాన్, గ్రామపంచాయతీ కారోబార్ ఇంద్రాల రామ చంద్రు, అంగన్వాడీ టీచర్ రేణుక, మరాఠి మల్లయ్య గ్రామ ప్రజలు పాల్గొన్నారు

# ప్రమాదకరంగా మారిన మునిపంపుల కాల్వ కట్టను మరమ్మత్తు చేయాలి

- నీటి విడుదలకు వార్షిక సమయ ప్రణాళిక ప్రకటించాలి
- మునిపంపుల గ్రామ సర్పంచ్ బొడ్డుపల్లి వెంకటేశం
- నీటి పారుదల డిఇ కి గ్రామ రైతులతో కలిసి వినతి



రామన్నపేట ( వార్త వేదిక సూర్య ) అసిఫ్ నహర్ కాల్వకు నీటిని నిలుపుదల చేసి విస్తృతంగా పెరిగిన గుర్రపు డెక్క ఆకును తొలగించి మునిపంపుల గ్రామంలో శుథిలావస్థకు చేరిన కాల్వ కట్టను మరమత్తు చేయాలని మునిపంపుల గ్రామ సర్పంచ్ బొడ్డుపల్లి వెంకటేశం అన్నారు. గ్రామ రైతులతో కలసి చిట్యాల నీటిరుదల డిఇ కార్యాలయంలో సెక్షన్ అధికారి శ్రీనివాస్ కు వినతి పత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ అసిఫ్ నగర్ కాలువ గత పది సంవత్సరాలుగా నిరాటంకంగా ప్రవహిస్తుండడంతో గుర్రపు డెక్క ఆకు రేపుగా పెరిగి కాలువను మొత్తం ఆవరించి ప్రమాదకరంగా మారిందని. అధిక ప్రవాహం వచ్చినప్పుడల్లా నీరు కట్ట మించి తరలిపోయి పలుసార్లు కట్టలు కూడా తెగిన సందర్భాలు ఉన్నాయని దీని మూలంగా తీవ్రమైన నష్టం జరిగే ప్రమాదం ఉందని అన్నారు. కాల్వ కట్టకింది పొలాలు జాలుబట్టి అరగపోవడంతో కనీసం కోత కోసుకోవడానికి కూడా ఇబ్బందికరంగా మారిందని పై పొలాలు నీటిలో మునిగిపోయి ఏళ్ల తరబడి సాగుకు నోచుకోకుండా ఉంటున్నాయని. కట్టపై విస్తృతంగా కంప ఇతర చెట్లు మలిచి నేటికి అడ్డంగా పడి ఉన్నాయని కనీస పర్యవేక్షణ కరువైందని వాపోయారు. దశాబ్ద కాలంగా ఈ ప్రాంత రైతాంగం ఇబ్బందులు పడుతున్నారని వెంటనే రైతులు ప్రజల సమస్యను దృష్టిలో పెట్టుకొని నీటిని ఒక నెలపాటు తగ్గించి గుర్రపుటే కాకును తొలగించి కాలువ కట్టను మరమ్మతులు చేయాలని, అసిఫ్ నగర్ కాల్వ విడుదలకు సమగ్ర సమయ ప్రణాళిక విడుదల చేయడం మూలంగా అందరూ ఒకేసారి పంట వేసుకోవడానికి అనువుగా ఉంటుందని తెలియజేశారు. నేటిపారుదల డిఇ సునీత నందను ఫోన్లో సంప్రదించగా త్వరలో సమస్య పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ తాళ్ల క్రాంతికుమార్, మాజీ ఉపసర్పంచ్ మామిడి పాండు రెడ్డి, గ్రామ రైతులు మన్నెం పద్మారెడ్డి,కల్లూరి రవి కుమార్, మేకల మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గర్భిణీ స్త్రీలు బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలి

**- మున్సిపల్ చైర్ పర్సన్ స్వప్న**




మోత్కూరు, ఏప్రిల్ 08( వార్తా వేదిక సూర్య ): గర్భిణీ స్త్రీలు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం స్వప్న సోమ నర్సయ్య అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో బుధవారం భాగంగా నేషనల్ షేఫ్ మదర్ హుడ్ డే (జాతీయ సురక్షిత మాతృత్వ దినోత్సవం) కార్యక్రమాన్ని11,12 వార్డులలో నిర్వహించారు. ఈ సందర్భంగా పి. హెచ్.సి.డాక్టర్ హేమంత్ కుమార్ మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు, బాలింతలు చేయించుకోవాల్సిన పరీక్షలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు పోషకాహారం కుటుంబ నియంత్రణ పై అవగాహన కల్పించారు. గర్భిణీలు ప్రభుత్వ ఆసుపత్రిలోనే కాన్పులు చేయించుకోవాలన్నారు. నార్మల్ డెలివరీ యొక్క ఆవశ్యకత పై వివరించారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన గర్భిణీలకు, బాలింతలకు,ప్రజలకు ఐరన్ మాత్రలు కాలుష్యం మాత్రలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ కే సతీష్ కుమార్, సిడిపిఓ యామిని, మున్సిపల్ వైస్ చైర్మెన్ పల్లెర్ల వెంకన్న, 11 12 వార్డు కౌన్సిలర్లు కారుపోతుల వెంకన్న, మెంట రమణ, అంగన్వాడి సూపర్వైజర్ జ్యోతి, సిహెచ్ఓ దేవకి, పి. హెచ్.ఎన్ సబిత, ఏఎన్ఎంలు సైదమ్మ, రేణుక, పర్వీన్ ఎంపి హెచ్ఏ వెంకన్న , అంగన్వాడీ టీచర్లు ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు. కాగా ఈ కార్యక్రమాన్ని పి హెచ్ సి సబ్ సెంటర్ స్థాయిలో అన్ని గ్రామాలలో అవగాహన పి. హెచ్.సి సిబ్బంది అవగాహన కల్పించారు.



# రాగిబావిలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి



మోత్కూరు, ఏప్రిల్ 08 (వార్తా వేదిక సూర్య): రైతులు ఇబ్బందులు పడకుండా రాగిబావి గ్రామంలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని సిపిఎం మండల నాయకులు,ఆ గ్రామ ఉపసర్పంచ్ పానుగుల లక్ష్మి రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఆ పార్టీ గ్రామ శాఖ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ.అరుకాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకోవడానికి మార్కెట్ వసతిలేక రైతులు త్రీవ ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.తమ గ్రామానికి చెందిన రైతులు దాన్యం అమ్ముకోవడానికి ఆత్మకూరు (ఎం), మండలం పుల్లాయిగూడెం,మోత్కూరు మండలంలోని ముషిపట్ల మోత్కూరు మార్కెట్ వెళ్ళవాల్సి వస్తుందన్నారు. రైతులు అమ్ముకునే ధాన్యానికి కూడా సీరియల్ ప్రకారం అమ్ముకునే ందుకు ఆ గ్రామాలలో పడిగాపులు పడవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. మద్దతు ధర కల్పిస్తామని మార్కెట్ లలోనే అమ్ముకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ,అధికారులు చెబుతున్నప్పటికీ ఈ ఇబ్బందులు పడలేని రైతులు చాలామంది ప్రైవేట్ వ్యాపారులకు దాన్యాన్ని అమ్మి నష్టపోతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రైతులకు ఇబ్బందులు లేకుండా తమ గ్రామంలో అమ్ముకునే విధంగా దాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు పానుగుల రమేష్, స్థానిక నాయకులు ఎన్నం వెంకట్ రెడ్డి, మెందు శేఖర్ రెడ్డి, ఎన్నం కళమ్మ,ఎన్నం జయమ్మ, యాదమ్మ, జక్కుల మంగమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదకరంగా వేలాడుతున్న విద్యుత్ వైర్లు వెంటనే సరి చేయాలి



మోత్కూరు , ఏప్రిల్ 08 (వార్తా వేదిక సూర్య ): మోత్కూరు మండలం రాగిబావి గ్రామంలో ప్రమాదకరంగా వేలాడుతున్న కరెంట్ వైర్లను వెంటనే సరిచేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బొల్లు యాదగిరి డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా కమిటీ ఇచ్చిన సమస్యలపై పిలుపులో భాగంగా రాగి బావి గ్రామంలో పలు సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దత్తప్పగూడెం నుండి రాగిబావి గ్రామానికి వెళ్లే రహదారి పక్కన, రాగిబావి నుండి ముషిపట్ల గ్రామానికి వెళ్లే దారిలో ప్రజలకు కరెంట్ వైర్లు తాకే విధంగా వేలాడుతున్నాయని పేర్కొన్నారు. ఈ వైర్లతో ఏ క్షణమైన ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందని,వెంటనే అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని కోరారు. ఈ వైర్లతో అనుకోకుండా ప్రజలకు ఏదైనా జరిగే ప్రమాదాలకు సంబంధిత అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. రాగి బావి గ్రామ పంచాయితీకి నూతన భవనం నిర్మాణం చేపట్టాలని, అన్ని వార్డుల్లో మురికి కాల్వలను ఏర్పాటు చేయాలని, ఇళ్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. రాజకీయాలకు అతీతంగా గ్రామాల అభివృద్ధికి నిధులను సమానంగా కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు, మండల కమిటీ సభ్యులు దడిపల్లి ప్రభాకర్, పానుగుల రమేష్,ఎన్నం వెంకట్ రెడ్డి, మెందు శేఖర్ రెడ్డి,పిట్టల చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

# 11న రామన్నపేటలో జరిగే వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఆహ్వాన సంఘం సమావేశాన్ని జయప్రదం చేయండి

- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బొల్లు యాదగిరి




మోత్కూరు, ఏప్రిల్ 08 (వార్తా వేదిక సూర్య ): తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా 3వ మహాసభలు రామన్నపేట లో మే 18 19 తేదీలలో నిర్వహిస్తున్నట్లు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బొల్లు యాదగిరి తెలిపారు. బుధవారం మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని సుందరయ్య కాలనీలో ఆ సంఘం పట్టణ కమిటీ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ వ్యవసాయ కార్మిక సంఘం 1936లో ఏర్పడిందన్నారు. భూమిలేని పేదల కోసం ప్రభుత్వ భూములు పంచాలని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఎన్నో ఉద్యమాలు నిర్వహించి పేదలకు భూములను అనేకమందికి పంపిణీ చేశామన్నారు. 18,19 జరిగే మహాసభలను పురస్కరించుకొని ఈనెల 11న రామన్నపేటలో సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశానికి సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.డి.జహంగీర్, వ్య.కా. సం.జిల్లా కార్యదర్శి కొండమడుగు నర్సింహ్మా హాజరౌవుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమానికి వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు,ప్రజలు,అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యురాలు రాచకొండ రాములమ్మ, పట్టణ కమిటీ నాయకులు గుండు లక్ష్మి,,కందుకూరి అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

# 18న తార్నాకలో తెలంగాణ ఉద్యమకారుల విస్తృత సమావేశం



మోత్కూరు, ఏప్రిల్ 08 ( వార్తా వేదిక సూర్య ); తెలంగాణ ఉద్యమకారుల రాష్ట్ర నాయకుల విస్తృత సమావేశం ఈనెల 18న హైదరాబాద్ లోని తార్నాక లో మర్రి కృష్ణారెడ్డి హాల్ లో నిర్వహిస్తున్నట్లు తెలంగాణ ఉద్యమకారుల రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దామరోజు వీరాచారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర నలుమూలలో ఉన్న తెలంగాణ ఉద్యమకారులు హాజరుకావాలని కోరారు.

# తాటి చెట్టు పై నుండి పడి గీత కార్మికుడికి తీవ్ర గాయాలు



వలిగొండ:ఏప్రిల్ 8 (వార్తా వేదిక సూర్య): యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం సుంకిశాల గ్రామానికి చెందిన గీత కార్మికుడు కొమ్మగాని ఐలయ్య గౌడ్ (పెద్ద గౌడ్ ) బుధవారం సాయంత్రం 4:00గంటల సమయం లో తాటి చెట్టు పై నుంచి ప్రమాదవశాత్తు కింద పడి తీవ్ర గాయాలు అయ్యాయి. వెంటనే గ్రామస్థులు అతనిని చికిత్స నిమిత్తం 108 కి సమాచారం అందించడంతో అతనిని మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ కి తరలించి చికిత్స అందిస్తున్నారు.

# లింగా సమానత్వం-ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన

**- పాల్గొన్న మంచి పరిసరాల విద్య అభివృద్ధి సంస్థ అధ్యక్షులు కానుగంటి శ్రీశైలం**



యాదాద్రి భువనగిరి,ఏప్రిల్ 8 (వార్తా వేదిక సూర్య):ఆత్మకూరు పంచాయతీ ఆవరణలో సంఘ బంధం-2 వారితో "నీడ్స్"స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో లింగా సమానత్వం-ప్రభుత్వ సంక్షేమ పథకాలు మరియు యువత అభివృద్ధిపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. మంచి పరిసరాల విద్య అభివృద్ధి సంస్థ అధ్యక్షులు కానుగంటి శ్రీశైలం మాట్లాడుతూ పురుషులు మహిళలు మరియు ఇతర లింగాల వారితో సంబంధం లేకుండా అందరికీ సమాన హక్కు బాధ్యతలు మహిళ సాధికారత వ్యవసాయం విద్యారంగాలపై అవగాహన కలిగి ఉండాలి అన్నారు .లింగ సమానత్వ సాధనలో మహిళల పాత్ర చాలా కీలకం పనులు స్త్రీ పురుషులు కలిసి పంచుకోవడం ద్వారా సమానత్వం సాధించవచ్చు ఈ విద్య ఆరోగ్యం ఇతర సామాజిక ఆర్థిక రంగా ల్లో స్త్రీ పురుషులు సమాన అవకాశాలు పెంచుకోవాలి అన్నారు. ఈ కార్యక్రమంలో వి.బి. కె. శ్యామల,. జయశ్రీ, సరిత ,మాధవి, లక్ష్మి, మంజుల,జ్యోతి,మంజుల, జ్యోతిలక్ష్మి, అండమ్మ తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రి భువనగిరి
సంపుటి : 1 సంచిక : 313
వార్త వేదిక సూర్య
యాదాద్రి భువనగిరి
గురువారం, ఏప్రిల్ 9, 2026

# నేడు మోత్కూరుకు ఎమ్మెల్యే రాక



మోత్కూరు, ఏప్రిల్ 08 (వార్తా వేదిక సూర్య ) ; స్థానిక వ్యవసాయ మార్కెట్ కార్యాలయం పరిధిలోని పిఎసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఈనెల 9న తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేల్ ప్రారంభించనున్నట్లు పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు గుండగోని రామచంద్రు గౌడ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా మండలంలోని పాటిమట్ల గ్రామంలో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న ధాన్యం కేంద్రాన్ని ప్రారంభించనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమాలకు మండలంలో ఉన్న ఎన్.ఎస్ యు.ఐ యూత్ కాంగ్రెస్ మండల పట్టణ కాంగ్రెస్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# సీఎం రిలీఫ్ ఫండ్‌తో దేవేందర్‌కు ఆర్థిక సాయం



మహేశ్వరం ఏప్రిల్ 8 (వార్త వేదిక సూర్య): మహేశ్వరం మండలం దుబ్బచర్ల గ్రామానికి చెందిన వాంకుడవత్ దేవేందర్ అనారోగ్యంతో ఇటీవల ఆసుపత్రిలో చికిత్స పొందారు. ఆయన చికిత్స ఖర్చులకు సహాయం అందించేందుకు స్థానిక నాయకులు సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేయగా, అది ఆమోదం పొందింది. ఈ సందర్భంగా సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును బాధితుడు దేవేందర్‌కు అందజేశారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కేఎల్ఆర్ ఈ సహాయాన్ని అందించారు. నాయకులు మాట్లాడుతూ, అవసర సమయంలో ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయం బాధిత కుటుంబాలకు ఎంతో ఉపశమనాన్ని కలిగిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ అధ్యక్షుడు నడ్డి సామెల్ రాజ్, ఎర్ర వెంకటయ్య, సుధాకర్, సంజీవరెడ్డి, కృష్ణ, మాజీ వార్డు సభ్యుడు జాను నాయక్, రమేష్ నాయక్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశైలం హైవే పై ఘోర రోడ్డు ప్రమాదం

- ప్రమాదంలో ఒకరు మృతి నలుగురికి గాయాలు







మహేశ్వరం, ఏప్రిల్ 8 (వార్త వేదిక సూర్య): మహేశ్వరం నియోజకవర్గం కందుకూరు ఎక్స్ రోడ్లో ఘోర రోడ్డు ప్రమాదం ఒకరు మృతి, నాలుగురికి తీవ్ర గాయాలు. మయూరి చికెన్ వాహనం డిసియం టైర్ పగిలి అదుపుతప్పి ఎదురుగా హైదరాబాద్ నుంచి కందుకూరు వస్తున్న షిఫ్ట్ కారును కందుకూరు ఇ రోడ్ నవారు బాల్ రెడ్డి ఫంక్షన్ హాల్ వద్ద ఢీ కొట్టింది.

కారులో ఒకే కుటుంబనికి చెందిన వారు గా గుర్తింపు. కారు నడుపుతున్న సురసాని భారత్ సింహ రెడ్డి, అక్కడికి అక్కడే మృతి చెందాడు , నాలుగురికి తీవ్రగాయాలు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకొని మృతదేహాని ఉస్మానియాకు తరలింపు. ఇంకా వివరాలు తెలియలిసి ఉంది.

# బునాది అనే కాలువ పూర్తి చేయాలి

- సిపిఐ మండల కార్యదర్శి గాదగాని మాణిక్యం

- ఇంటింటికి సిపిఐ కార్యక్రమంలో భాగంగా కొండాపురంలో పర్యటన



మోటకొండూరు ,ఏప్రిల్ 8,( వార్త వేధిక సూర్య ) :భూనాది కానీ కాలువ పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించాలనీ సిపి పార్టీ మోటకొండూరు మండల కార్యదర్శి గాదగాని మాణిక్యం అన్నారు. ఇంటింటికి సిపిఐ కార్యక్రమంలో భాగంగా మండలంలోని కొండాపురం గ్రామంలో సిపిఐ నాయకులతో కలిసి గ్రామంలో సమస్యలు ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే పునాది గాని కాలువను పూర్తి చేసి పరిసే ప్రాంత రైతులకు నీరు అందివ్వాలని, ఎన్నికల ఆరు గ్యారంటీలు అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు పసుల నరసింహ, మంచాల రాధమ్మ, మంచాల పద్మ ,ఎండి పాషా, మంచాల మాధవి , మల్లారెడ్డి, మంచాల సుగుణ, తదితరులు పాల్గొన్నారు.




# పెద్దబావి (చాకంపల్లి)లో వడ్ల కొనుగోలు కేంద్రం ఏర్పాటు

- రైతులకు తీరిన కష్టాలు
- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య కి ధన్యవాదాలు తెలిపిన సర్పంచ్ ఏర్పుల రజిత శ్రీరాములు ముదిరాజ్





మోటకొండూరు, ఏప్రియల్ 8 (వార్త వేధిక సూర్య ): రైతు సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం అడుగులు వేస్తోంది. మోటకొండూరు మండలం మండల పరిధిలోని పెద్దబావి (చాకంపల్లి )గ్రామంలో రైతుల చిరకాల కోరికైన వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ప్రభుత్వ విప్ ,ఆలేరు ఎమ్మెల్యే బిర్ల ఐలయ్య చొరవతో నూతనంగా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ఏర్పుల రజిత శ్రీరాములు ముదిరాజ్ ప్రభుత్వ విప్ బిర్ల ఐలయ్య కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గతంలో వడ్లు అమ్ముకోవడానికి పొరుగు గ్రామాలకు వెళ్లాల్సి వచ్చేదని, ఇప్పుడు సొంత గ్రామంలోనే కేంద్రం ఏర్పాటు కావడం వల్ల రవాణా ఖర్చులు తగ్గుతాయని , దళారుల నుండి గ్రామ రైతులు మోసపోకుండా ఉంటారని సర్పంచ్ పేర్కొన్నారు.

పెదబావి (చాకంపల్లి ) చిన్న గ్రామం అయిన రైతుల ఇబ్బందులను గుర్తించి, వెంటనే స్పందించి కొనుగోలు కేంద్రం మంజూరు చేసినందుకు ప్రభుత్వ విప్ కి గ్రామస్తులు మరియు రైతుల పక్షాన కృతజ్ఞతలు తెలిపారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేసిన కాకి ఈశ్వర్ ముదిరాజ్



మహేశ్వరం ఏప్రిల్ 8(వార్త వేదిక సూర్య): రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కాకి ఈశ్వర్ ముదిరాజ్, ఆధ్వర్యంలో మహేశ్వరం గ్రామ కావాలోని బయి తండా కు చెందిన మునావత్ అనిత భర్త మనవత్ చందర్ నాయక్,కి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుని అందజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కాకి ఈశ్వర్ ముదిరాజ్ . మహేశ్వరం అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ అల్లె బిక్షపతి. శివగంగ ఆలయ కమిటీ చైర్మన్ అల్లే కుమార్. మహేశ్వరం పట్టణ శాఖ అధ్యక్షులు బంగారుగళ్ల లాజర్. ఉప్పుగడ్డ గ్రామ పంచాయతీ సర్పంచ్ రాజు నాయక్ . కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ సమన్వ యకర్త ఇందిరమ్మ కమిటీ సభ్యులు స్వర్ణగంటి సుభాష్. మహేశ్వరం గ్రామ మాజీ ఉపసర్పంచ్ ఇందిరమ్మ కమిటీ సభ్యులు కర్రెల రాములు ముదిరాజ్. ఆలయ కమిటీ డైరెక్టర్ పేయ్యల దేవేందర్. కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ నియోజకవర్గ అధ్యక్షుడు గదగూటి హరికృష్ణ ముదిరాజ్. మహేశ్వరం ముస్లిం వెల్ఫేర్ సొసైటీ మండల అధ్యక్షులు షేక్ హాజీ బాబా. సేవాదళ్ మహేశ్వరం మండల అధ్యక్షులు శెట్టి అశోక్.

మహేశ్వరం గ్రామ 14వ వార్డు ఇన్చార్జి పుట్లగారి చందు. 10 వ వార్డు ఇన్చార్జి కాకి మల్లేష్ ముదిరాజ్. 13 వ వార్డు ఇంచార్జ్ మునావత్ అనిల్ నాయక్. కాంగ్రెస్ పార్టీ నాయకులు గగనం ఆంజనేయులు. పినమోని శ్రీకాంత్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు,

# సుద్దాల మహోదయ్ గౌడ్ సర్పంచ్‌కు బెల్ట్ షాపులు మూసివేయాలంటూ వినతి

- కుటుంబాల ఆర్థిక రక్షణ కోసం మహిళల పోరాటం -- బెల్ట్ షాపులపై చర్యలు కోరుతూ లేఖ
- బెల్ట్ షాపుల రద్దే లక్ష్యం సుద్దాల మహిళల కఠిన హెచ్చరిక
- మద్యం దుష్ప్రభావాలపై మహిళల ఆగ్రహం బెల్ట్ షాపుల తొలగింపుకు డిమాండ్.
- గ్రామ శాంతి కోసం మహిళల కదలిక సర్పంచ్‌కు వినతి పత్రం సమర్పణ.
- సుద్దాలలో బెల్ట్ షాపులపై మహిళల బంద్ -- ఆరోగ్యం, భద్రత కోసం డిమాండ్



గుండాల, ఏప్రిల్ 08 (వార్తా వేదిక సూర్య ) ; సుద్దాల గ్రామంలో ప్రజా ఆరోగ్యం, కుటుంబాల ఆర్థిక భద్రత దృష్ట్యా బెల్ట్ షాపులను రద్దు చేయాలని మహిళా సంఘాలు డిమాండ్ చేశాయి. గ్రామంలో అక్రమంగా నడుస్తున్న మద్యం విక్రయాల కారణంగా అనేక కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా రోజువారీ కూలీలు సంపాదించే డబ్బు మద్యం కోసం ఖర్చవుతూ, కుటుంబాల ఆర్థిక పరిస్థితి దెబ్బతింటోందని తెలిపారు. ఈ సమస్య వల్ల కుటుంబాల్లో గొడవలు, మహిళలపై వేధింపులు పెరుగుతున్నాయని, పిల్లల భవిష్యత్తు కూడా ప్రమాదంలో పడుతోందని మహిళలు పేర్కొన్నారు. గ్రామంలో శాంతి భద్రతలు క్షీణిస్తున్నాయని, యువత చెడు అలవాట్లకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో మహిళా సంఘాలు ఏకమై గ్రామ సర్పంచ్‌ను కలిసి కరపత్రం అందజేశారు. బెల్ట్ షాపులను తక్షణమే మూసివేసి, అక్రమ మద్యం విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గ్రామాన్ని మద్యం రహితంగా మార్చేందుకు అధికారుల సహకారం అవసరమని తెలిపారు. సమస్య పరిష్కారానికి త్వరితగతిన చర్యలు తీసుకోకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని మహిళలు హెచ్చరించారు. గ్రామ ప్రజల సంక్షేమం కోసం బెల్ట్ షాపుల నిర్మూలన అత్యవసరమని స్పష్టం చేశారు.

# రైస్ మిల్ పొగతో ఇబ్బందులు



మహేశ్వరం ఏప్రిల్ 8 (వార్త వేదిక సూర్య):మహేశ్వరం: మండలం కోళ్ల పడకల్ గ్రామపంచాయతీ పరిధిలోని సాయి మహాలక్ష్మి రైస్ మిల్ నుంచి వెలువడుతున్న దట్టమైన పొగ, విషవాయువుల కారణంగా గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ కాలుష్యం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తడమే కాకుండా, పంట పొలాల్లో దిగుబడిపై ప్రతికూల ప్రభావం పడే అవకాశముందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే భవిష్యత్తులో త్రాగునీరు కూడా కలుషితం అయ్యే ప్రమాదం ఉందని గ్రామస్థులు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో సాయి మహాలక్ష్మి రైస్ మిల్‌పై పర్యావరణ పరిరక్షణ చట్టాలు, గాలి కాలుష్య నియంత్రణ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రామస్థులు సంతకాలతో కూడిన వినతి పత్రాన్ని గ్రామ సర్పంచ్ చేపంగి ప్రవీణ్‌కు అందజేశారు. సమస్యను వెంటనే పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమం చేపడతామని అఖిలపక్ష నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సోలిపేట అనంతరెడ్డి, సంగెం భాస్కర్ గౌడ్, సొసైటీ డైరెక్టర్ నాగుల సత్యనారాయణ, కుమ్మరిండ్ల శ్రీనివాస్, ఎలుకటి కృష్ణ, చేపంగి జంగయ్య, నందిగామ రవి, బీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు ఎలుకటి రఘుపతి, టీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎలుకటి నరసింహ, బీజేపీ నుంచి వార్డు సభ్యుడు ఆవుల తరుణ్, మాజీ వార్డు సభ్యుడు బండ బిక్షపతి, లక్ష్మీపతి గౌడ్, పడకంటి శివ తదితరులు




Printed, Published and Owned by **POLOJU SRINIVASA CHARY**, and **Printed at SURYA DIGITAL PRINTERS**, H.No. 1-32, Markondeya Nagar, Choutuppal Municipality, Yadadri-Bhuvanagiri District, Telangana State-508252., and Published at H.No. 1-32, Markondeya Nagar, Choutuppal Municipality, Yadadri-Bhuvanagiri District, Telangana State-508252. **Editor: POLOJU SRINIVASA CHARY. PRGI.NO:- TGTEL/25/A0305**, Cell:9985389183. **EmailId:vaarthavedhikasurya2025@gmail.com**